ఇన్‌చార్జి డీఆర్వోగా విజయకుమార్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి (ఇన్‌చార్జి)గా ఎస్.విజయకుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ ఓ. ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం డీఆర్వో చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. విజయకుమార్ ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా పని చేస్తున్నారు. డీఆర్వోగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.



భక్తిశ్రద్ధలతో చిరాగా

ఏఎస్‌పేటలోని శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ సతీమణి దొరసానమ్మ గంధమహోత్సవంలో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో చిరాగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దర్గాలోని కోనేరు, పరిసరాలలో భక్తుల దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా విద్యుద్దీప వెలుగుల్లో దర్గా ప్రాంతం శోభిల్లింది. మంగళవారం తహలీల్ ఫతేహాతో గంధమహోత్సవం ముగియనున్నది.

- ఏఎస్‌పేట (ఆంధ్రజ్యోతి)



అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ'

- యూరియా కొరత లేదు.. విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- జిల్లాలో 31,231 మట్టి నమూనాలు సేకరించడమే లక్ష్యం
- డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోండి!
- 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

మొదటి విడతలో నగదు అందనివారికి 2వ విడతలో జమ

ముఖాముఖి

అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం నిధులు అందుతాయని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి పేర్కొన్నారు. మొదటి విడతలో దాదాపు 1.97 లక్షల మందికి రూ.5 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది, ఇంకా 4 వేల మంది వరకు ఎన్‌పీసీఐ చేయించాల్సి ఉందని, అదేవిధంగా 320 మంది వరకు ఈకేవైసీ చేయాలని చెప్పారు. మొదటి విడతలో వివిధ కారణాల వల్ల నగదు జమ కాని అర్హత కలిగిన రైతులకు రెండో విడతలో నగదు జమవుతుందని చెప్పారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, ఖరీఫ్‌లో పంటసాగు, యూరియా కొరత తదితర అంశాలపై సత్యవాణి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

- వివరాలు 8లో..



ఉదయగిరి వైద్యశాలకు మహర్దశ

- రూ.5.75 కోట్లు మంజూరు

ఉదయగిరి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి మహర్దశ పట్టనుంది. వైద్యశాల అభివృద్ధికి రూ.5.75 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం వైద్యం, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో పాత భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రత్యేక ప్రసూతి కేంద్రం నిర్మాణంతోపాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టనున్నారు. జిల్లాకు సుదూర ప్రాంతంలో ఉన్న ఉదయగిరివాసులకు మెరుగైన వైద్యసేవలు అందకపోవడంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వైద్యశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు వైద్యశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్రంలోని తొమ్మిది సామాజిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.51.75 కోట్లు మంజూరు చేయగా అందులో ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కూడా చోటు లభించింది. వైద్యశాలకు రూ.5.75 కోట్లు మంజూరు కావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొదలకూరు సర్పంచి చెక్ పవర్ రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

పొదలకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మేజర్ గ్రామ సర్పంచ్ మల్లికా చిట్టెమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో ఎల్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బి మల్లికార్జున నాయుడు ఆధారాలతో లిఖితపూర్వకంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి లేఖ రాయడంతో ఈ ఏడాది జనవరిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జూన్‌లో నెల్లూరు డీఎల్‌పీవో నిర్వహించిన విచారణ నివేదికల ఆధారంగా సర్పంచ్ చిట్టెమ్మ ఇచ్చిన సంజాయిషీ అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ చెక్ పవర్‌ను ఆరు నెలలపాటు రద్దు చేశారని పొదలకూరు ఎంపీడీవో నరసింహారావు సోమవారం తెలిపారు. చెక్ పవర్‌ను ఎంపీడీవోకు అప్పగించారు.


క్లినిక్‌లో కదలిక!

- ఏడాదిలో అన్నీ నిర్మించేలా ప్రభుత్వ నిర్ణయం

- పొదలకూరు మండలంలో ఎక్కువగా 22 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించగా ఇందులో 10 నిర్మాణాలు పూర్తయ్యాయి. 8 వరకు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి.. నాలుగింటి నిర్మాణం మొదలే కాలేదు. ఇందుకు స్థలాల మంజూరు కూడా కాలేదు.
- మనుబోలు మండలంలో 13 క్లినిక్‌ల నిర్మాణానికి అనుమతులుండగా ఏడు మాత్రమే నిర్మాణానికి నోచుకున్నాయి. ఆరు క్లినిక్‌ల పనులు ప్రారంభం కాలేదు. ఇదిగో.. అదిగో అంటూ ప్రభుత్వం ఐదేళ్లు గడిపేసింది.
- కావలి రూరల్ మండలంలో 14 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం ఐదు చోట్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నా మిగిలినవి పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. పనులు నత్తనడకన సాగుతున్నాయి.



పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామంలో బేస్‌మెంట్‌కే పరిమితమైన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం



పొదలకూరులో పిచ్చిచెట్ల మధ్య అసంపూర్తిగా భవనం

అసంపూర్తిగా విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు

487 భవనాలకు 74 మాత్రమే పూర్తి

వాటిలోనూ సగమే వినియోగం

పనులకు త్వరలో నిధులు విడుదల


నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పల్లెప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేందుకు నిర్దేశించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు సొంత భవనాలకు నోచుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం 2022 మార్చిలో ఈ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉపాధిహామీ పథకం కింద 50 శాతం, వైద్య శాఖకు ద్వారా మరో 50 శాతం నిధులతో పీహెచ్‌సీలకు అనుబంధంగా గ్రామాల్లో వీటిని నిర్మించాల్సి ఉంది. అయితే నాటి ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవటం, స్థలం కేటాయింపులో కొరవడిన చొరవతో నిర్మాణాలు ముందుకు సాగనంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలపై దృష్టిపెట్టింది. వీటిని ఏడాదిలోపు పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆయా నిర్మాణాలకు రూ. 17 లక్షలు ఖర్చవుతుండగా ప్రస్తుతం భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.26 లక్షలు కేటాయిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులు కూడా త్వరలో విడుదల చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. అదేవిధంగా స్థల సమస్య ఉన్నచోట పరిష్కార మార్గాలనూ అన్వేషిస్తోంది.

రూ.12.39 లక్షల అద్దె

జిల్లాకు 487 హెల్త్ క్లినిక్‌లు మంజూరుకాగా ఇప్పటివరకు 74 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. వాటిల్లో 36 భవనాల్లోనే క్లినిక్‌లు నడుస్తున్నాయి. దీంతో 451 క్లినిక్‌లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇందుకుగాను ప్రభుత్వం నెలకు రూ.12.39 లక్షలు వెచ్చిస్తోంది. సకాలంలో స్వంత భవనాలు పూర్తి చేసి ఉంటే ఈ నిధుల భారం తగ్గి ఉండేది.

సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి పరిశీలన

8



సోమశిల.. జలకళ!

- 65 టీఎంసీలకు చేరువలో డ్యాం
- ఇక నిర్లక్ష్యం తగదు
- అప్రమత్తతే శ్రీరామరక్ష

అనంతసాగరం సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న వరదతో సోమశిల ప్రాజెక్టు 65 టీఎంసీలకు చేరువైంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా వరదలు వచ్చే సమయంలో 70 నుంచి 75 టీఎంసీల మధ్య నీటినిల్వకు అధికారులు చర్యలు తీసుకొంటారు. అయితే, భారీ వరద కొనసాగితే నీటినిల్వ తక్కువగా ఉంచుకోవడం శ్రేయస్కరం. గత వైసీపీ హయాంలో భారీవరద కొనసాగే సమయంలో అవగాహన లేక 76 టీఎంసీలు నిల్వ చేసి ప్రాజెక్టు మనుగడ దెబ్బతీశారు. అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకొని మనుగడ కాపాడేలా ముందస్తు చర్యలు తీసుకొంటే మంచిదని రైతాంగం కోరుతోంది. గడిచిన కొంతకాలంగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా రోజువారీగా 2 టీఎంసీల నీరు సోమశిలకు చేరుతోంది. దీంతో కండలేరు జలాశయానికి వరద కాలువ ద్వారా సరఫరా చేస్తూ అక్కడి నీటినిల్వ పెంచారు. పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవక ముందే సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలా మారాయి. ప్రస్తుతం వస్తున్న వరదతోపాటు పెన్నాపరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే సోమశిలకు భారీవరద నమోదై సూచనలు ఉన్నాయి. దీంతో వచ్చే వరద, కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు ప్రాంతాల్లో కురిసే వర్షాలను బేరీజు వేసుకొంటూ సోమశిలలో నీటినిల్వ పెంచుకోవడం ఉత్తమంటూ నిపుణులు భావిస్తున్నారు.

సిబ్బంది కొరత

సోమశిల ప్రాజెక్టు వద్ద సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఉన్నవారు ఉద్యోగ విరమణ పొందడం, కొత్తగా సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పెరిగింది. ఇక్కడ 40 నుంచి 50 మంది వరకు ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా కేవలం 10 మందిలోపు మాత్రమే ఉన్నారు.

- 23,031 క్యూసెక్కుల వరద

జలాశయానికి సోమవారం 23,031 క్యూసెక్కులు వస్తుండగా 62.650 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఏఆర్‌టీ, సరోగసి కేంద్రాలకు అనుమతి తప్పనిసరి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏఆర్‌టీ, సరోగసి కేంద్రాల ఏర్పాటుకు వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు తప్పనిసరని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా అనుమతుల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏఆర్‌టీల కింద 9 మంది వైద్యులు, లెవల్ 1 క్లినిక్‌లకు 12 మంది వైద్యులు, లెవల్ 2 క్లినిక్ ఏఆర్‌టీ బ్యాంకులకు ఆరుగురు వైద్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. సరోగసి కింద ఒకరు అనుమతి తీసుకున్నారని తెలిపారు.



ఉదయగిరి మండలం దాసరిపల్లిలో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం

పంచాయతీలకు మంచిరోజులు

శాశ్వత భవన నిర్మాణాలకు నిధులు

40 పంచాయతీలకు రూ.12.8 కోట్ల కేటాయింపు

నెల్లూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): సొంతభవనాలు కూడా లేకుండా కునారిల్లుతున్న జిల్లాలోని పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శుభవార్త చెప్పాయి. మొదటి విడతలో 40 పంచాయతీలకు పాలన భవనాల నిర్మాణం కోసం అనుమతులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఈ భవనాలను నిర్మించనున్నారు. జిల్లాలో మొత్తం 722 పంచాయతీలు ఉండగా, అందులో 127 పంచాయతీలకు సొంత భవనాలు లేవు. ఈ పంచాయతీల్లో నూతన భవనాలు నిర్మించేందుకు జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికీ పంపగా, మొదటిదశలో 40 భవనాలు నిర్మించేందుకు అనుమతులు లభించాయి. ఒక్కో పంచాయతీ భవనాన్ని రూ.32లక్షలతో నిర్మించనున్నారు. మొత్తం 40 పంచాయతీల భవనాలకు రూ.12.80 కోట్లు కేటాయిస్తూ పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవనాల నిర్మాణాల బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా మిగిలిన 87 పంచాయతీల్లో కూడా దశలవారీగా నూతన భవనాలు నిర్మించనున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

ఎంపికైన పంచాయతీలు ఇవే..

చెముడుగుంట (వెంకటాచలం), పెద్దపాళెం (విడవలూరు), దాసరిపల్లి (ఉదయగిరి), పైనంపురం, మామిడిపూడి (ముత్తుకూరు), దేవరాయపల్లి, కొత్తపల్లి (అనంతసాగరం), మన్నంగిదిన్నె (కావలి), అరవీటి కిస్తీపురం (వింజమూరు), కొమ్మలపూడి, కాగితాలపూరు (మనుబోలు), మండపం (టీపీగూడూరు), వేములపాడు (జలదంకి), రాపూరు, సోమరాజుపల్లి (ఇందుకూరుపేట), పుట్టుపల్లి, తూర్పుపల్లి (చేజర్ల), మల్లికార్జునపురం, పాపిరెడ్డిపాళెం (టీపీ గూడూరు), లింగపాళెం (వీపీ పాళెం), అమ్మవారిపాళెం (పొదలకూరు), నెల్లేపల్లి, శానాయిపాళెం (రాపూరు), కలువాయి (చేజర్ల), కుమ్మరకొండూరు (కలిగిరి), చాటగొట్ల, మర్రిపల్లి (పొదలకూరు), పెరంకొండ (కలువాయి), ఊచగుంటపాళెం, ఎలమంచిపాడు, అడకలూరు (దగదర్తి), మహ్మదాపురం (వరికుంటపాడు), ఎస్‌వీ కండ్రిగ (బోగోలు), రామవరప్పాడు (జలదంకి), గాంధీజన సంఘం (సంగం), శెట్టిపాళెం (కొండాపురం), మేదరమిట్టపాళెం (లింగసముద్రం), బ్రహ్మేశ్వరం (దుత్తలూరు), రాళ్ళపాడు (గుడ్లూరు), బసవాయిపాళెం (కొడవలూరు).

రంగనాథుడి పవిత్రోత్సవాల ప్రారంభం



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిగింది. స్వామి వారికి ఏడాది పొడవునా జరిగే సేవల్లో తెలిసో తెలియక జరిగిన దోషాల నివారణకు ఈ పవిత్రోత్సవాలను ఏడాదికి ఓసారి నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు ఈ నెల 7 వరకు జరుగుతాయి. పవిత్రోత్సవాలకు ఆండాళ్ సన్నిధిలో హోమ గుండాల నిర్మాణం పూర్తయింది. అంకురార్పణ పూజల్లో ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆదరణేది!?

- దివ్యాంగుల సంక్షేమంలో అధికారుల నిర్లక్ష్యం

8లో..

పేకాట అడ్డాపై పోలీసుల సీరియస్!

- ఐజీ నుంచి సీఎం కార్యాలయం వరకు ఆరా
- స్థావరాలపై దాడులకు ప్రత్యేక బృందం
- నిర్వాహకుల అరెస్ట్‌కు ఆదేశాలు
- కందుకూరు పరిధిలోని ఎస్‌ఐలకు మెమోలు

- వివరాలు 8లో..

గంటపాటు మొరాయించిన సర్వర్

మనుబోలు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒకటవ తేదీ వచ్చిందంటే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ప్రభుత్వం అందించే పింఛన్ల కోసం ఎదురు చూస్తుంటారు. అయితే సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు గ్రామాల్లోకి వెళ్ళారు. ఉదయం 7 గంటల సమయంలో సర్వర్ నిలిచిపోయింది. పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. గంట తరువాత సర్వర్ పనిచేయడంతో అందరికీ పింఛన్లు పంపిణీ చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9979
వెండి కిలో ధర	రూ. 126100
వెండి ఒక గ్రాము	రూ. 129.10

క్రికెట్ స్టేడియం నిర్మాణం కలేనా...?

- ఏడేళ్ల క్రితమే 50 ఎకరాల భూసేకరణ
- వైసీపీ హయాంలో నిర్మాణం ఊసే లేదు
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవ చూపాలంటున్న క్రీడాకారులు


కంటేపల్లి వద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సేకరించిన భూమి

వెంకటాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడా వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వెంకటాచలం మండలం గొలగమూడి సమీపంలోని కంటేపల్లి వద్ద క్రికెట్ స్టేడియం నిర్మిస్తున్నట్లు గత టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాదు.. అందుకు అవసరమైన స్థలాన్ని కూడా ఏడేళ్ల క్రితమే సేకరించింది. కానీ స్టేడియం మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు.

● 50 ఎకరాలు రెడీ.. అయినా కదలని అధికారులు

ఏడేళ్ల క్రితం క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం 50 ఎకరాలను సేకరించి రాష్ట్ర క్రికెట్ బోర్డుకు అప్పగించింది. అయితే ఆ భూములను ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిందంటూ గ్రామానికి చెందిన కొందరు భూ సేకరణకు అడ్డు తగిలారు. వారు కోర్టును కూడా ఆశ్రయించారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన భూములను లబ్ధిదారులు సాగు చేయనందువల్ల తిరిగి తీసుకోవడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుందని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో భూసేకరణకు అడ్డంకి తొలగిపోయింది. భూ సేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈ క్రమంలో స్టేడియం నిర్మాణం త్వరలో పూర్తవుతుందని క్రీడాభిమానులు ఆశించారు. కానీ ఆ భూముల వద్ద బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు నిర్మాణం విష యాన్ని మాత్రం విస్మరించారు.

● వైసీపీ హయాంలో స్టేడియం ఊసే లేదు

ఈ క్రమంలో వైసీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన త ర్వాత ఐదేళ్ల పాలనలో కనీసం స్టేడియం నిర్మాణం ఊసే ఎత్త లేదు. దీంతో క్రీడాభిమానులు గత వైసీపీ ప్రభుత్వ వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది క్రితం రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్రీడాకారుల ఆశలు మళ్లీ చిగురిం చాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ హయాంలోనైనా క్రీడాకారుల కల నేరవేరుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి క్రికెట్ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేయాలని, ఆ దిశగా రాష్ట్ర క్రికెట్ బోర్డు అధికారులతో చర్చించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.



'స్వమిత్వ' సర్వేతో ఉచితంగా ఇంటి పత్రాలు

నారాయణరెడ్డి, ఎంపీడీవో, బుచ్చి

డిజిటలైజేషన్ చేసి ఇంటి యజమానులకు ఆస్తి హక్కు పత్రాలను అందించడమే 'సమి త్వ' సర్వే లక్ష్యమని ఎంపీడీఓ నారాయణరెడ్డి తెలిపారు. వారం రోజులుగా 10 గ్రామ పంచాయతీలలో సర్వే జరుగుతోందన్నారు.

?. 'సమిత్వ' సర్వే ప్రధాన లక్ష్యం ఏమిటి

!. గ్రామ పంచాయతీలలో ఇళ్ళు, ఇంటి స్థలాలను సర్వే చేసి డిజిటలైజేషన్‌తో కూడిన ఆస్తి హక్కు పత్రాలను ఆ మేరకు ఇంటి యజమానులకు అందించడమే 'సమిత్వ' సర్వే లక్ష్యం. ఈ సర్వేతో ఏళ్ళ తరబడి ఇళ్ల పట్టా లు లేనివారికి ఆస్తి హక్కు పత్రం అందుతుంది. వీటిపై బ్యాంకు రుణాలు పొందే అవకాశం కూడా వుంటుంది.

?. సర్వే ప్రక్రియ ఎలా చేపడతారు

!. ప్రతి గ్రామ పంచాయతీలో అసెస్మెంట్ నంబరు ప్రకారం ఇళ్ళు, స్థలాలను సర్వే చేస్తా రు. విస్తీర్ణం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. సర్వే పూర్తయిన తర్వాత సచివాల యంలో డిజిటైలేజేషన్ ద్వారా ప్రభుత్వానికి పంపిస్తారు. ఆస్తి హక్కు పత్రాలను గ్రామ సభల్లో ఇంటి యజమానులకు అందజేస్తారు.

?. ఇంటి హక్కుపత్రాల కోసం రుసుం చెల్లించాల్సి వుంటుందా...?

!. పైసా ఖర్చు లేకుండా సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి సర్వే చేస్తారు. ఇంటి హక్కు పత్రాలను యజమానులకు అందజేస్తారు.

?. ఇప్పటిదాకా ఎన్ని పంచాయతీల్లో సర్వే చేపట్టారు?

!. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు ఉండగా, గతంలో 3 పంచాయతీలలో ఈ సర్వే జరిగింది. 10 గ్రామ పంచాతీలలో సుమారు 300 ఇళ్లకు సర్వే ప్రక్రియ పూర్తయింది. త్వరిత గతిన పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం.

-బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)


బుచ్చిలో టీడీపీ నాయకుల సంబరాలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : తొలిసారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా సోమవారం బుచ్చిరెడ్డిపాళెంలోని టీఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్లో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివకుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు కల్యాణ్, లక్ష్మీకాంతమ్మ, మాజీ ఎంపీటీసీ పర్వీన్ పాల్గొన్నారు.

ఏపీ టూరిజం ఉద్యోగులను ఆదుకోండి

కోవూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 23 ఏపీ టూరిజం హోటళ్ళను ప్రైవేటుపరం చేయడంతో సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవాలని ఉద్యోగ సంఘాల నాయకులు ఏపీ టీడీసీ వైస్ చైర్మన్ ఆమ్రపాలీకి విన్నవించారు. విజయవాడలోని కార్యాలయంలో సోమవారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వర రావు నాయకత్వంలో ఏపీ టూరిజం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ గంగరాజు, ప్రధాన కార్యదర్శి తురకా శ్రీనివాసులు ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి పీ వీరారెడ్డి, నాయకులు బాబూరావు, అంజలరావు, మహబూబ్ బాషా, ఈశ్వర్, రవి పాల్గొన్నారు.


రైతులకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న అధికారి రామమోహన్

రాపూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేపినాపిలో మండల వ్యవసాయాధికారి పి సోమసుందర్ ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం టెక్నికల్ అగ్రికల్చర్ అధికారి ఎస్ రామమోహన్ అధ్యక్షతన రైతులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వ హించారు. ఈకార్యక్రమంలో ఆరుతడి పంటల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ హరిప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏపీలో మాత్రమే రూ. 4 వేల పింఛన్

● వైసీపీ అసత్య ప్రచారాలు నమ్మకండి: ఎమ్మెల్యే సోమిరెడ్డి


అక్కంపేటలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నెలకు రూ. 4వేలు పింఛన్ అందిస్తున్న రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్లపూడి, మడ, అక్కంపేట గ్రామాల్లో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దివ్యాంగులు, గిరిజనులు, వృద్ధులకు ఆయన ఫించన్లు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ. 2750 కోట్లు వంతున ఏడాదికి పింఛన్ల కోసమే ప్రభుత్వం రూ. 33 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణాలో రూ. 2,500లు మాత్రమే ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు రుణపడి ఉండాలన్నారు. అనంతరం మూడు గ్రామాల ప్రజల నుంచీ అర్జీలు స్వీకరించి, సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి మధునాయుడు, నాయకులు ధనెంకుల రఘురామ నాయుడు, పూండ్ల రామ్మోహన్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఏకొల్లు కోదండరామిరెడ్డి , రామ్మూర్తి, ఆంజనేయులు యానాదినాయుడు, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో మాదిరిగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడను

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మాదిరిగా తాను ఎలాం టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడే వ్యక్తిని కాదని ఉదయ గిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం స్వగ్రామమైన యర్రంరెడ్డిపల్లిలో నిర్వహించిన సుపరిపాల నలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నానన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో రూ. 50కోట్ల నిధులతో 750 సిమెంటు రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు తోడు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. అలాగే తన ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే కాకముందే 29వేల మందికి ఆరోగ్య సంజీవని ద్వారా వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. వింజమూరులో అన్న క్యాంటీన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం రూ.46 లక్షల తో చేపట్టిన సిమెంట్‌రోడ్ల శిలాఫలకాలను ఆవి ష్కరించారు. తొలుత ఆలయాల్లో పూజలు నిర్వ హించి పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధు సూదనరావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్ వలి


సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ ఖాదర్ వలి

వెంకటాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్ వలి ఆదేశించారు. మండ లంలోని చవటపాళెంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లో టీబీ, గళ్ల పరీక్షలు, లెప్రసీ, హెచ్‌ఐవీ వంటి పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పీహెచ్‌సీలో కాన్పుల శాతం పెంచేందుకు ప్రజలకు అవగాహన కల్పించ డంతో పాటు, నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ల్యాబ్ పరీక్షలు, ఓపీ రికార్డులను కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ ప్రణవి, సీహెచ్‌ఓ రామసుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, బొలిగార్ల శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ జన్మదిన వేడుకలు


రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో సోమవారం డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు దుప్పట్లు, బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరింత ఉన్నత స్థాయిలో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు సందూరి శ్రీహరి, సాయి శ్వేత, సుబ్రహ్మణ్యం, విష్ణు, చల్లా చెంచయ్య, షేక్ రహీమ్, చిన్న, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌ల వేతనాలు చెల్లించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలని సో మవారం డిప్యూటీ తహసీల్దారు షాజియాకు ఆవాజ్ మండల కమిటీ వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు షేక్‌నాయబ్ మాట్లాడుతూ ప్రతినెలా గౌరవ వేతనం చెల్లి స్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 15నెలల కాలంలో ఒకసారి మాత్రమే 6నెలల గౌరవ వేతనం ఇచ్చింద న్నారు. 9 నెలలుగా ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. అలాగే మేనిఫెస్టోలో 50 ఏళ్ల దాటిన బీసీలకు పింఛన్ ఇస్తామని ప్రకటించి ఇంతవరకు దాని ఊసే ఎత్తలేదన్నారు.

గణపతి బప్పా మోరియా..

● కోవూరులో రూ. లక్షా 70 వేలు పలికిన గణేశ్ లడ్డూ


కోవూరు: వేలంపాటలో దక్కించుకున్న లడ్డూతో ప్రవీణ్ కుటుంబ సభ్యులు


మనుబోలు: నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

మనుబోలు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం రాత్రి పోటాపోటీగా గణేశ్ విగ్రహాల గ్రామోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పది మండపాల్లో వినాయక విగ్రహాలకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సెట్టింగులు, పూలాలంకరణలతో గ్రామోత్సవాలకు ఏర్పాటు చేశారు. లడ్డు, డబ్బుల మాలకు వేలం పాటలను నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మనుబోలు సమీపంలోని కండలేరు వాగులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

కోవూరు: పట్టణంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమల్ని సోమవారం నిమజ్జనం చేసే సమయంలో వేసిన లడ్డూల వేలం పాటల్లో లడ్డు ధర బాగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది లడ్డూల వేలంపాటల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక టీఎన్‌సీ కళాశాల సమీపంలోని ప్రతిమ ప్రాంగణంలో లడ్డూ ధర రూ 1,70,000 పలికింది. పుస్తకాల షాపు నిర్వాహకుడు ప్రవీణ లడ్డూను దక్కించు కున్నారు. కోనేటి కయ్యలు ప్రాంతంలో నిర్వహించిన వేలంపాటలో రూ 93,000కు యూనిక్ సెలూన్ నిర్వా హకుడు పొంగూరు శ్రీనివాసులు సొంతం చేసుకున్నారు. పలుచోట్ల వేలం పాటలో లడ్డూ ధర రూ 25,000ల నుంచి రూ. 50,000 పలకడం విశేషం.

విడవలూరు : మండలపరిధిలోని చౌకిచర్ల దళిత కాలనీలో సోమవారం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లతో అభిషేకాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు సమాధి శ్రీనివాసులు, కొల్లు చిన్న వెంకయ్య, ఈదూరు సురేష్‌లు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయకచవితి ఉత్సవ కమిటీ, అంబేద్కర్ యూత్ సభ్యులు గరుతోటి ప్రసన్న కుమార్, అలగర కిరణ్, అలగర మనోజ్ ఎల్లు సునీల్, ఎల్లు చరణ్, ఈదూరు దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని నిడుముసలి గ్రామంలో విఘ్న వినాయకుడి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన లడ్డు వేలంపాటలో లేబూరు సుకుమార్ రెడ్డి గణేశ్ లడ్డును రూ.19 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి లేబూరు రవికుమార్ రెడ్డి. ఏ. అనిల్‌కుమార్, వెంకటశేషయ్య, శివకోటయ్య, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

స్కూల్ బస్సు, బైక్ ఢీ

● భర్త దుర్మరణం, భార్యకు గాయాలు


సంఘటన స్థలంలో షేక్ ఖాసిమ్ మృతదేహం

ఆత్మకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంబాయి జాతీయ రహదారిపై కరటంపాడు వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు స్కూలు బస్సును మోటారు బైక్ ఢీకొనడంతో మోటారు బైక్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందిగా వెనుక కూర్చున్న భార్యకు స్వల్ప గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు... ఉదయగిరి మండలం వెలుతూరు గ్రామానికి చెందిన షేక్ ఖాసిమ్(35), అతని భార్య హజరత్‌బీ మోటారు బైక్‌పై ఆత్మకూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కరటంపాడు వద్ద ఆత్మకూరుకు చెందిన స్కూలు బస్సు కరటంపాడు గ్రామంలోకి క్రాస్ అవుతుండగా ఎదురుగా వచ్చిన మోటారు బైక్ ఢీకొంది. దీంతో మోటారు బైక్ నడుపుతున్న భర్త ఖాసిమ్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య హజరత్‌బీకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమర్టం నిమిత్తం ఖాసిమ్ మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి స్థానిక ఉదయగిరి రోడ్డులో బుడంగుంట క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి పట్టణం బుడంగుంటకు చెందిన గొల్లపూడి రామకృష్ణ(78) ఆదివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని ముసునూరులో ఉన్న తమ కుమార్తె గోసల జ్యోతి వద్దకు వెళ్లేందుకు బయలుదేరాడు. ఉదయగిరి రోడ్డులో బుడంగుంట క్రాసింగ్ వద్ద వాహనం కోసం నిలబడి ఉండగా జలదంకి వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రక్ వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బలమైన గాయాలైన ఆయనను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమార్తె జ్యోతి ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్‌ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు వ్యక్తి ...

ఉదయగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన రాజుపాళెం వెంకటేశ్వర్లు (50) పాము కాటుకు గురై మృతిచెందాడు. ఎస్‌ఐ కర్నాటి ఇంద్ర సేనారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశ్వర్లు గ్రామంలో ఇస్త్రీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ తరుణంలో పనిచేసి అక్కడే నిద్రించేవాడు. ఆదివారం పాము కాటుకు గురికావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలించగా అక్కడ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించినట్లు ఎస్‌ఐ ఇంద్ర సేనారెడ్డి తెలిపారు.

నారాయణప్పపేటలో చోరీ


చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

సీతారామపురం, సెప్టెం బర్ 1 (ఆంధ్ర జ్యోతి): గ్రామ పంచాయతీ లోని నారాయణప్ప పేట గ్రామ ఎస్సీ కాలనీలో శీలం రామచంద్రయ్య, మల్లాపు రం చెన్న కేశవులు ఇళ్ళలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.67 వేల నగదు అపహరించినట్లు బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాము పదిరోజుల క్రితం ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైకు వెళ్లి సోమవారం ఉదయం ఇళ్లకు తిరిగివచ్చామన్నారు. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి తాళాలు పగులగొట్టి వస్తువులను చెల్లాచెదురుగా పడేసి సూటికేస్‌లోని విలువైన పత్రాలతోపాటు నగదును తీసుకెళ్లారని వాపోయారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవలాలగడ్డకు చెందిన షేక్ గాజుల ముంతాజ్ అనే మతిస్థిమితం లేని మహిళ గతనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

దళారుల దోపిడీ నుంచి ఆదుకోండి

● ధాన్యం ధరలపై రైతుల గగ్గోలు


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అల్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రెండో కారు పంట దిగుబడి సమయంలో దళారుల దోపిడీ నుంచి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. దళారులు చేస్తున్న మోసానికి గురై తీవ్రంగా నష్టపోతున్నామంటూ సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీయూ 1010 రకం ధర రూ.15,500 ఉండగా సన్నాల ధరలు రూ.16,200కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల్లో రూ.17 వేలకు పైగా కొనుగోలు చేస్తున్న తరుణంలో మండలంలో మాత్రం దళారులు తమ ఇష్టారాజ్యంగా ధరలను దిగజార్చుతున్నారి వాపోయారు. ఇలా చేస్తే తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు యరటపల్లి శేఖర్‌రెడ్డి, మోమిడి మాధవరావు, ఆట తిరుమల, పప్పు సుధాకర్, రంజిత్, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 560



జనసేన వైద్య శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని జనసేన నాయకులు సోమవారం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి నాయకులకు, జనసైనికులకు, వీర మహిళలకు పరీక్షలు చేశారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, ఆఫీస్ ఇన్‌చార్జి జమీర్, కృష్ణారెడ్డి, రవి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నెల్లూరు సహకార అధికారిగా రవికుమార్



నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారిగా వీ. రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)కి బిజినెస్ మేనేజర్ (ఎఫ్‌ఏసీ)గా కూడా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు సబ్ డివిజన్ పరిధిలోని సహకార సంఘాలకు ఈ-ఆడిట్ పూర్తి చేయిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించడం ద్వారా సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.

వెంకయ్య నాయుడుతో ఆర్డీ విల్సన్ భేటీ



వెంకయ్య నాయుడుకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఆర్డీ విల్సన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును సోమవారం తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు విల్సన్‌కి ఆశీస్సులు అందజేశారు. తెలుగుభాషా పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. విజయవాడలోని తెలుగు అకాడమీ కార్యాలయాన్ని సందర్శించాలని విల్సన్ వెంకయ్యనాయుడుని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అగ్రస్థానం

నెల్లూరురూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు పింఛన్లు అందచేయడంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దేవరపాళెంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పింఛన్లు అందచేస్తున్నదన్నారు. అనంతరం రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఈనెల 20న రోడ్డును పునఃప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, పముజుల ప్రదీప్, మదన్‌కుమార్‌రెడ్డి, జలదంకి సుధాకర్, పద్మాకర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

లంబోదరుడి ఆశీస్సులతోనే లడ్డూ ప్రసాదం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లంబోదరుడి ఆశీస్సులతోనే రెండోసారి గణేశుడి లడ్డూ ప్రసాదం తమకు దక్కిందని తేజస్విని గ్రాండ్ అధినేత తోట శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ కేదార్‌సింగ్, తేజు డెవలపర్స్ కో ఆర్డినేటర్ రాధాకృష్ణారెడ్డి, డైరెక్టర్ పెంచలరెడ్డి తెలిపారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లోని తేజస్విని గ్రాండ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గతేడాది లడ్డూ వేలంలో తాము రూ.8.10లక్షలకు దక్కించుకున్నామన్నారు. దాని ఫలితంగా తమ వ్యాపారాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ ఏడాది కూడా పోటీపడి రూ.13.50లక్షలకు లడ్డూను దక్కించుకున్నామన్నారు. గణేశ్ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించిన ఎన్.మదనమోహన్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

ఇండోసోల్‌లో ఉద్యోగ అర్హత పొందిన వారికి శిక్షణ

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీలో ఉద్యోగ అర్హత పొందిన వారికి నైపుణ్యాభివృద్ధిపై మండలంలోని రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. గత నెల 20వ తేదీన గుడ్లూరు మండలం చేవూరు వేదికగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 70 మంది ఉద్యోగ అర్హత లెటర్స్ పొందారు. వారికి నెల్లూరు స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇండోసోల్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్‌ఖయూం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుశీలకుమార్ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బన్న, ఇండోసోల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మారై సీటీ స్కాన్ ఉచితం

- జీజీహెచ్‌లో పేదరోగులకు...
- పీపీపీ పద్ధతితో బయటవారికి ఉపయోగం
- పేద, మధ్య తరగతికి ఎంతో డబ్బు ఆదా

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : ఇది జిల్లాలోని రోగుల పరిస్థితి. నగరంలోని జీజీహెచ్‌లో మూడేళ్ల క్రితం ఎమ్మారై, సిటీస్కాన్ రోగులకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఇది జీజీహెచ్ రోగులకే కాకుండా బయట వాళ్లకు తీసేలా పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతి ప్రవేశపెట్టారు. బయట స్కానింగ్ కేంద్రాల్లో రూ. వేలు ఖర్చు అవుతుండగా, జీజీహెచ్‌లో ఎమ్మారై, సిటీస్కాన్ చాలా తక్కువ ధరకు తీస్తారు. అయితే ఇక్కడ పీపీపీ పద్ధతిలో ఎమ్మారై, సిటీస్కాన్ తీస్తారన్న విషయం ఎక్కువ మంది రోగులకు, సహాయకులకు తెలియదు. దీంతో ఎంతోమంది బయట స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ తీయించుకుంటూ ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. ఇక ప్రైవేట్ వైద్యులు కూడా జీజీహెచ్‌లో ఎమ్మారై, సిటీస్కాన్ ఉందని, అక్కడ తీయించుకోవచ్చని రోగులకు చెప్పడం లేదు. పైగా స్కానింగ్ కేంద్రాల్లో ఆయా వైద్యులకు కమీషన్ రూపంలో కొంత నగదు వస్తుండటంతో ఎక్కువ మంది వైద్యులు తాము సూచించిన స్కానింగ్ కేంద్రాలకు వెళ్లాలని చెబుతున్నారు. ఇదిలా ఉంటే కొందరు ప్రభుత్వ వైద్యులు కూడా జీజీహెచ్ స్కానింగ్ కేంద్రానికి వెళ్లమని సూచించడం లేదు. దీంతో రోగుల జేబులకు చిల్లు పడక తప్పటం లేదు.

- విడవలూరుకి చెందిన నాగరాజు నగరంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అతనికి బ్రెయిన్ ఎమ్మారై అవసరం ఉంది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు బ్రెయిన్ ఎమ్మారైకి ప్రైవేట్‌గా రూ.5,500 ఖర్చు అవుతుండటంతో అందుబాటులో ఉన్న జీజీహెచ్‌లో రూ. 2,600లకే ఎంఆర్‌ఐ తీయించాడు. దీంతో అతనికి రూ. 1900 మిగిలింది.
- ఇందుకూరుపేట మండలానికి చెందిన సరళ అత్యవసర చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు సిటీస్కాన్ అవసరం కావటంతో వైద్యుడి సూచనల మేరకు సిటీస్కాన్‌కు ఓ ప్రైవేట్ స్కానింగ్‌కు వెళ్లింది. అక్కడ సిటీస్కాన్ తీసి రూ.4,200 వసూలు చేశారు. ఇందుకు అప్పుచేయాల్సి వచ్చింది. తీరా జీజీహెచ్‌లో తక్కువకే సిటీస్కాన్ తీస్తారని తెలియడంతో ఆందోళన వ్యక్తం చేసింది



జీజీహెచ్‌లోని స్కానింగ్ సెంటర్

రోగులు సద్వినియోగం చేసుకోవాలి

జీజీహెచ్‌లో రోగులే కాకుండా బయట ఆసుపత్రుల్లో అవసరమైన రోగులు కూడా వీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. ఇందుకు ఎక్కువగా ప్రచారం అవసరముంది. ఎమ్మారై, సీటీస్కాన్ అందుబాటులోకి వచ్చాక తగినంత మంది రేడియాలజిస్ట్‌లు ఉన్నారు. మూడు షిఫ్ట్‌లలో స్కానింగ్ కేంద్రం అందుబాటులో ఉన్నా, రోగుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో రిపోర్టులు ఆలస్యం అవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నాం.



- డాక్టర్ కళారాణి, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్

ప్రైవేట్, జీజీహెచ్ స్కానింగ్ ధరలు ఇలా...

పరీక్ష	ప్రైవేట్	జీజీహెచ్	పరీక్ష	ప్రైవేట్	జీజీహెచ్	పరీక్ష	ప్రైవేట్	జీజీహెచ్
బ్రెయిన్ పెయిన్ ఎమ్మారై	5,500	2660	పీఎన్ఎస్,నెక్	5,000	2,660	జాయింట్(ఎనీవన్)	5,500	3,045
బ్రెయిన్ పెయిన్, కాంట్రాక్టు	8,000	3,460	ఆర్బిట్	6,000	2,660	మస్కిలోస్కెలిటల్	6,000	2,820
హోల్ అబ్డామిన్	5,000	2,660	పిట్యూటరీ ఫోసా	6,000	2,660	స్పైన్	5,500	2,660
థొరాక్స్ /చెస్ట్	5,500	2,660	టెంపోరల్ బోన్	6.000	2,660	సీటీస్కాన్	3,500	839

నేత్రాలకు ఎంతో ప్రాధాన్యం : శార్వాణి



మాట్లాడుతున్న డాక్టర్ శార్వాణి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో నేత్రాలను ఎంతో ప్రాధాన్యం ఉందని జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్ డాక్టర్ శార్వాణి తెలిపారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం బుజబుజనెల్లూరులో జడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం జరిగింది. పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నేత్రదానంపై విద్యార్థి దశనుంచే అవగాహన పెంచుకోవాలని తెలిపారు. నేత్రదానంతో ఓ నిండు ప్రాణాల్ని కాపాడిన పుణ్యఫలం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంటకరమణ, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్,డీ. శ్రీనివాసులు, రామరాగవయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆక్రమణలు



వ్యవసాయ పరిశోధన కేంద్రం పంట కాలువలో వేసిన సిమెంటు పైపులు

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండ లంలోని చినపవని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సత్యనారాయణపురంకు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడ్డారు. దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు నిర్మాణం చేపట్టి పరిశోధన కేంద్రానికి చెందిన పంట కాలువలో సిమెంటు పైపులు వేశారు. కేంద్రానికి చెందిన ఇనుప ఫెన్సింగ్‌ను తొలగించారు. పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న వారి పొలాల్లోకి వెళ్లేందుకు ఈ విధంగా ఆక్రమణలకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. అయితే వారి పొలాల్లోకి వెళ్లేందుకు ఉన్న రోడ్డును వారి పొలాల్లో కలుపుకొని, పరిశోధనా కేంద్రంలో రోడ్డును దౌర్జన్యంగా వేశారని చెప్పారు. కాగా 2021 జనవరి 7న అప్పటి ప్రభుత్వం ఈ వ్యవసాయ విత్తనాభివృద్ధి క్షేత్రం భూములలోని 540 ఎకరాలలో సుమారు 410 ఎకరాలను అపరాలు, చిరుధాన్యాల పరిశోధనా కేంద్రం ఏర్పాటు కోసం ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్శిటీకీ బదలాయించిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ పనులు జరుగుతున్నాయి.

ఆక్రమణలు తొలగించండి

మండలంలోని చినపవ ని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆక్రమణలు తొలగించాలని ఆ కేంద్రం ఇన్ చార్జ్, సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, సైంటిస్టు నాగార్జున కోరా రు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు కార్యాలయం లో జరిగిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దారు ఎం.కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పరిశోధన కేంద్రానికి సమీపంలోని సత్యనారాయణపురంకు చెందిన కొందరు బలవంతంగా పరిశోధన కేంద్రం ఉత్తరం-పడమర దిక్కుల మధ్యలో ఉన్న ఫెన్సింగ్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి, ఇరిగేషన్ కాలువపై సిమెంటు పైపులు వేసి, పరిశోధన కేంద్రంలోకి అక్రమంగా ప్రవేశించి రోడ్డు వేశారని చెప్పారు. ఇది తీవ్ర అభ్యంతరకరమని, అలాగే పరిశోధన కేంద్రం నిబంధనలను అడ్డుకోవడమేనని చెప్పారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బారకాసులో అన్నదానం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని బారకాసు సెంటర్‌లోని హజరత్ ఖాదర్ ఔలియా నిషాన్ వద్ద ముస్లిం నాయకులు సంగం షఫీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సయ్యద్ సమీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. మానవులంతా ఒకే తల్లిదండ్రి బిడ్డలని ప్రవక్త తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు షబ్బీర్, మున్వర్, సాలార్, ఎస్ఆర్ ఇలియాజ్, జుబేర్, మంజూర్, ముస్తాక్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.



బారకాసు సెంటర్‌లో అన్నదానం చేస్తున్న ముస్లిం నాయకులు

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

- చెక్కుల పంపిణీలో మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తున్నదని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 47 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలంలో 183 మందికి రూ. 2.15 కోట్లు పంపిణీ చేశామన్నారు. విజనరీ నేత ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపిస్తే ఎందరికో ఉపాధి, అవకాశాలు ఉంటాయని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని మళ్లీ కూటమి ప్రభుత్వం ఆయా పనులను చేపట్టి పూర్తి చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, పార్టీ నాయకురాళ్లు విజేతరెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్‌లో కేవీ విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య), సెప్టంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో జరిగిన క్షేత్రస్థాయి యువ పార్లమెంట్ పోటీల్లో హైదరాబాద్ క్షేత్రం నుంచి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ నెల్లూరు విద్యార్థులు ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ కె.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులు న్యూఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన ఈవ, జోషిబాబు, మంజీత్, అనిల్, మీనాలను ప్రత్యేక అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

డీఆర్ చానల్ పనుల్లో అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరిపించాలి

- ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి



కావలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దగదర్తి- రాచర్లపాడు(డీఆర్) చానల్ పనుల్లో పాత ప్రతిపాదనలు మార్చి జరుగుతున్న అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్ కార్పొరే షన్ (ఏఐడీ) చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కావలి జలవనరులశాఖ ఇన్‌చార్జి ఈఈ ఖాన్‌ను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 3 మండలాల పరిధిలోని 23 గ్రామాల్లో 23 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ కాలువ నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై ఇప్పటికే జలవనరులశాఖ ఈఈ, ఎస్ఈ, సీఈలకు వినతిపత్రాలు అందించానని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కాలువకు గత టీడీపీ ప్రభుత్వంలో రూ.30 కోటను సీఎం చంద్రబాబునాయుడు మంజూరు చేయగా అప్పట్లో జీరో నుంచి 6.7 కి.మీ వరకు కాలువకు కాంక్రీట్ గోడలు నిర్మించేలా ప్రతిపా దనలు చేశారన్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో దానిని నిర్లక్ష్యం చేశారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత ప్రతిపాదనలను కాంట్రాక్టర్లకు అనుకూలంగా మార్చుకుని కొత్త ప్రతిపాదనలు పంపి నాసిరకంగా పనులు చేస్తున్నందున రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. డీఆర్ చానల్ బాగుంటేనే డీఎం చానల్‌కు నీరు వస్తుందని చెప్పారు. కాలువపై బ్రిడ్జీలు కట్టకుండా సైఫన్‌లు కట్టాలని అప్పుడే రైతులకు సక్రమంగా నీరు పారుతుందన్నారు. ఒక రైతుగా కాలువ నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై తాను పోరాడుతానని చెప్పారు.

అక్టోబరు 2నాటికి చెత్త రహిత ఏపీ

- మున్సిపల్ మంత్రి నారాయణ వెల్లడి



మ్యాప్‌ను పరిశీలిస్తూ అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అక్టోబరు 2నాటికి చెత్తరహితంగా ఏపీని తయారు చేసేందుకు వేగవంతంగా పనిచేస్తున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం ఆయన మైపాడురోడ్డులోని స్మార్ట్ స్ట్రీట్ బజారును, బోడిగాడితోట వద్ద పార్కు పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారాన్ని కోల్పోతూ 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా అందించిందని విమర్శించారు. అందులో ఇప్పటివరకు 78 లక్షల టన్నుల చెత్తను తొలగించామన్నారు. రాజధాని అమరావతిలో 30 శాతం గ్రీనరీకి కేటాయిస్తామని తెలిపారు. నెల్లూరులో 47 పార్కులకుగానూ 35 పార్కులను ఆధునీకరించామని చెప్పారు. డిసెంబరులోపు బోడిగాడితోట పార్కును అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. పార్కుల్లో చిన్నపాటి ఫంక్షన్లు చేసుకునేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ కమిషనర్ నందన్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించండి



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల యజమానులు యాజమాన్యపు హక్కులు పొందేందుకు ప్రభు త్వం తీసుకువచ్చిన ఎల్ఆర్ఎస్‌పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లు యజమానులకు పూర్తి అధికారిక హక్కులు లభిస్తాయన్నారు. తద్వారా ఇంటి నిర్మాణ అనుమతులు సులభంగా వస్తాయని తెలిపారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కి 51 మంది వినతులు అందచేశారు. అనంతరం పలు సమీక్షల్లో ఆయన పాల్గొన్నారు.

- **దుకాణం సీజ్**

నగరంలోని చిన్నబజారు వద్దనున్న ఏసీఎస్ఆర్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో 10వ నెంబరు దుకాణందారుడు గతేడాది నుంచి రూ.50 వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో సదరు దుకాణాన్ని ఆర్ఐలు కిరణ్, వరప్రసాద్ సచివాలయ సిబ్బందితో కలిసి సోమవారం సీజ్ చేశారు.

ఎంపీ రాహుల్‌పై కేసు నమోదు చేయాలి



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(క్రైం) సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఓట్ యాత్రలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్, ప్రధాని మోదీ ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యాఖ్యానించారని, ఆయనపై కేసు నమోదు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ సీహెచ్. కోటేశ్వర రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి మాట్లాడుతూ రాహుల్ నినాదాలకు రెచ్చి పోయిన కాంగ్రెస్ కార్యకర్త మహమ్మద్ రిజ్వీ మోడీ తల్లిని కూడా అనకూడని మాటలు అన్నారని, ఆ మాటలకు దేశంలోని మహిళలంతా బాధపడుతుంటే ఇప్పటికీ రాహుల్, ప్రియాంక ప్రశ్చాత్తాప ప్రకటన కూడా చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నరాల సుబ్బారెడ్డి, పొట్లూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

- **మోదీని దూషించడాన్ని ఖండిస్తున్నాం**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఓటర్‌యాత్రలో భాగంగా బిహార్‌లోని దర్భంగాలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీని, స్వర్గస్థులయిన ఆయన తల్లిని తీవ్ర అసభ్య పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ అధికార ప్రతినిధి వాకాటి నారాయణరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి హేయకరమైన వ్యాఖ్యలను సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ ఖండించకపోవడం బాధాకరమన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు రేపు గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో 51వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రి ఉత్సవాల పనులు ప్రారంభించేందుకు ఈనెల 3 ఉదయం 9గంటలకు ఆలయంలో గుంజ ప్రతిష్ఠ జరుగుతుందని ఆయన తెలిపారు. భక్తులంతా తరలిరావాలని కోరారు.



మేమింతే.. మారమంతే !

రోడ్లపై ప్రమాదాలకు గుంతలు ఓ కారణమైతే.. అడ్డంగా ఉండే ఆవులు మరో కారణమవుతున్నాయి. సిటీలో రోడ్ల పై ఆవులను తగ్గించిన కార్పొరేషన్ అధికారులు, వాటిని కల్లూరిపల్లిలోని గోశాలకు తరలించారు. కాగా శివారు ప్రాంతాల్లో రోడ్లపై ఉండే ఆవుల జోలికి మాత్రం వెళ్లలేదు. దీంతో అవి గుంపులు గుంపులుగా రహదారులపై నిలబడి, పడుకుని ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారాయి. నెల్లూరు - ముత్తుకూరు రహదారి ధనలక్ష్మీపురం వద్ద ఆవుల మంద తాకిడికి ట్రాఫిక్ జామ్ అవుతుందని, వీటి వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలూ జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు ఈ ప్రాంతంలోని ఆవులను గోశాలకు తరలించాలని వారు కోరుతున్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



ఐదేళ్లు.. 8 దేశాలు

సైకిల్‌పై తమిళ యువకుడి యాత్ర

ఈ చిత్రంలో సైకిల్‌పై ఉన్న వ్యక్తి తమిళనాడుకు చెందిన ముత్తు. ఎంబీఏ ఫైనాన్స్ చదివాడు. 8 దేశాలు సైకిల్‌పై తిరిగి ఐదేళ్లలో 11 లక్షల మొక్కలు నాటించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించాలన్న ఆశయంతో యాత్ర సాగిస్తున్నాడు. 2023 నుంచి ఇదిగో.. ఇలా సైకిల్‌పై మూడు దేశాలు చుట్టేసి సోమవారం నాటికి మనుబోలు చేరుకున్నాడు. అక్కంపేటలో ఉన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కలిశారు. తన పర్యటన వివ రాలు, లక్ష్యాలను ఆయనకు వివరించి, ప్రముఖుల అభినంద నల చిత్రాలను చూపించారు. దీంతో ముత్తు సైకిల్ యాత్ర విజయవంతం కావాలని అభినందిస్తూ రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని ఎమ్మెల్యే అందించారు ఎక్కువ మొక్కలు నాటితే దేశానికి, పర్యావరణానికి ఎంతో మంచి దని, అందుకే తాను సైకిల్‌యాత్ర చేస్తూ మొక్కలు నాటిస్తున్నట్లు ముత్తు చెప్పుకొచ్చారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

రైతుల కోసం కొత్త ఆవిష్కరణలు చేయాలి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రైతులకు ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ.శివనారాయణ అన్నారు. నెల్లూరులోని కేవీకేను సోమవారం ఆయన సందర్శించారు. సబ్జెక్ట్ మ్యాటర్ స్పెషలిస్టులు రూపొందించిన సాంకేతిక కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవలు, శిక్షణ కార్యక్రమాలు, విస్తరణ కార్యక్రమాల్లో పురోగతి వంటి అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే ఆధునిక సాంకేతిక రైతులకు సమయానికి అందించడం ఎంతో ముఖ్యమన్నారు. పంటల వైవిధ్యకరణ, మార్కెటింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రదర్శనల వల్ల రైతులకు సాంకేతికతపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. అనంతరం కేవీకేలోని పంటల విభాగం, పౌల్ట్రీ, మత్స్య పెంపకం, తేనెటీగల పెంపకం, వర్మీకంపోస్టు డెమో యూనిట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్సీఎస్పీ లబ్ధిదారులకు స్ప్రేయర్లు, ఇన్క్యుబేటర్లు తదితర వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ.లలితాశివజ్యోతి, శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, విజయకుమార్‌లతోపాటు రైతులు, మహిళా సంఘాలు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న శివనారాయణ, లలితాశివజ్యోతి తదితరులు

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం); సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను సోమవారం కలెక్టర్ ఆనంద్ నగరంలోని మూలాపేటలో పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి పడుగుపాడులో పింఛన్లను పంపిణీ చేశారు. మూలాపేటలోని ఈఎస్ ఆర్ఎం స్కూల్ ప్రాంతంలో మంచానికే పరిమితమైన డయాలసిస్ రోగి సిరివెళ్ల శ్రీనివాస్‌కు రూ.15వేలు, ఒంటరి మహిళ శారదకు రూ.4వేల పింఛను మొత్తాన్ని కలెక్టర్ అందచేశారు. కలెక్టర్ స్వయంగా వచ్చి పింఛన్ అందచేయటం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం 94 శాతం పింఛన్లను పంపిణీ చేశారు.

జాప్యం లేకుండా వినతులు పరిష్కరించండి

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఆనంద్ ● 436 అర్జీల్లో రెవెన్యూవే 174



పీజీఆర్ఎస్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం); సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రధానంగా భూసమస్యలు, రెవెన్యూ అంశాలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా, నిర్దిష్ట గడువులోగా పరిష్కారం చూపించాలని పేర్కొన్నారు. ఒకవేళ సమస్యలను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

● **మొత్తం అర్జీలు 436**

ఈ కార్యక్రమానికి 436 అర్జీలు వచ్చాయి. వాటిలో రెవెన్యూశాఖవి 174, మున్సిపల్‌శాఖవి 41, సర్వేకు 18, పీఆర్‌వి 38, మిగిలినవి వివిధ శాఖలవి ఉన్నాయి ఈ కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, ఇన్‌చార్జి డీఆర్‌వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● **క్యాంపస్‌లోనే ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలి**

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ క్యాంపస్ పరిధిలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆనంద్‌కు కాంగ్రెస్ పార్టీ నేతలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో సిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్ మాట్లాడారు. వీఎస్‌యూకి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడుతున్న దశలో క్యాంపస్‌లోనే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ధనుంజయ్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 79 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన 79 మంది బాధితులు వారి సమస్యలను పోలీసు అధికారులకు తెలిపారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకొని, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిని చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. సమస్యలను పోలీసు అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ . రామారావు, లీగల్ అడ్వైజర్ టీ. శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న ఏఎస్పీ సౌజన్య



గణేశుడికి గంగ కరువు

● స్వర్ణాల చెరువు, పెన్నా నదిలో మునగని విగ్రహాలు



పెన్నానదిలో నిమజ్జనం కాకుండా నీటిపై తేలియాడుతున్న వినాయక విగ్రహాలు





గణేశ్ ఘాట్‌లో నీట మునగని భారీ బొమ్మలు

విఘ్నాలను తొలగించే వినాయకుడికి చవితి ఉత్సవాల్లో పరిపూర్ణత కరువైంది. నీటి వనరుల్లో నిమజ్జన చేస్తే గణపతి బొమ్మలు మునగని పరిస్థితి నెల్లూరు నగరంలో నెలకొంది. నగరంలో 5రోజులు గణేశ్ ఉత్సవాలు పోటాపోటీగా జరిగాయి. నగరం అంతా జై గణేశా... జైజై గణేశా అనే నామస్మరణ మారుమోగింది. ఉత్సవాలకు నెల రోజుల ముందే యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. నిమజ్జనం కోసం స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్, రంగనాయకులపేట సమీపంలో పెన్నా నది వద్ద ఏర్పాట్లకు నుడా, కార్పొరేషన్ నిధులు దాదాపు రూ3కోట్లకుపైగా ఖర్చు చేశారు. గణేశ్ ఘాట్ వద్ద నిమజ్జనం ఏర్పాట్లపై విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో రూరల్ ఎమ్మెల్యే రెండుసార్లు సమన్వయ, సమీక్ష సమావేశాలు నిర్వహించారు. వినాయకుడి విగ్రహాలు మునిగిపోయేంతగా నీటి మట్టం పెంచాలని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ శాఖ ప్రతీ ఏటా మాదిరిగానే ఈసారి కూడా తగినంత నీటిని నిల్వ చేయలేదు. దీంతో పెద్ద విగ్రహాలు నీట మునగక పైకే కనిపిస్తున్నాయి. భక్తులు వీటిని చూసి 'అయ్యో.. వినాయకా!' అనుకుంటున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

'పేకాట అడ్డా'పై పోలీసుల సీరియస్!

● స్థావరాలపై దాడులకు ప్రత్యేక బృందం ● నిర్వాహకుల అరెస్టుకు ఆదేశాలు ● ఎస్ఐలకు మెమోలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కందుకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో విచ్చలవిడిగా మారిన పేకాట స్థావరాలపై పోలీసు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. 'కందుకూరు గడ్డ పేకాటకు అడ్డా' శీర్షికన గత నెల 27న ఆంధ్రజ్యోతిలో ఓ కథనం ప్రచురితం అయ్యింది. రేయింబవళ్లు పేకాటలు జరుగుతున్న తీరు, పోలీసులు అటువైపు కన్నెత్తిచూడకపోతున్న వైనంపై ఎస్పీ కృష్ణకాంత్‌తోపాటు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. సీఎం కార్యాలయం కూడా పేకాట నిర్వహణపై సీరియస్ కావటంతో స్థానిక పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఇక్కడి పరిస్థితులపై ఐజీ సమగ్ర నివేదిక తెప్పించుకుని తగు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఈ మేరకు పేకాట నిర్వహిస్తున్న వారిని తక్షణం అరెస్టుచేసి రిమాండ్‌కు పంపాలని, ఎక్కడా పేకాట జరగడానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. దీంతో కందుకూరు సీఐ అన్వర్‌బాషా నేతృత్వంలో పేకాట స్థావరాలపై దాడులకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు.

● **పరారీలో నిర్వాహకులు**

రామాయపట్నం పరిసరాల్లోని ఓ రిసార్ట్‌లో పేకాట నిర్వహణ బాధ్యతలు చూస్తున్న కందుకూరువాసి, ఉలవపాడు మండలంలో పేకాట నిర్వహిస్తున్న అధికార పార్టీ నేత నాలుగు రోజులుగా పరారీలో ఉన్నారు. వీరు ఎప్పుడు వచ్చినా అరెస్టు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

● **ఎస్ఐలకు మెమోలు : డీఎస్పీ**

కందుకూరు నియోజకవర్గంలో పేకాట నిరోధానికి కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఉలవపాడు, గుడ్లూరులతోపాటు మిగిలిన 4 స్టేషన్ల ఎస్ఐలకూ మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. ఎక్కడ పేకాట జరిగినా వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే, పేకాట నిర్వాహకులుగా గుర్తింపు పొందిన వారి వివరాలు ఎస్ఐలకు అందజేశామని వారి కదలికలపై నిఘా ఉంచామన్నారు. కందుకూరు సీఐ అన్వర్‌బాషా నేతృత్వంలో పేకాట స్థావరాలపై దాడులకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించినట్లు చెప్పారు.

రైతులకు మద్దతు ధర దక్కనివ్వని దళారులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధాన్యానికి పుట్టికి 20- 22వేల రూపాయల మద్దతు ధర కల్పిస్తుంటే వాటిని దళారులు 15-16 వేల వరకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం బుచ్చిలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. ప్రతి మండలంలో బీజేపీ మండల కమిటీలు వేసి, ఈ నెల 17న ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 2వరకు పువా పక్షోత్సవాల పేరుతో సేవా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను మోసం చేస్తున్న దళారులపై అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బత్తల కృష్ణయ్య, పెంచలయ్య, శ్రీనివాసులు, శివపార్వతి, మల్యాద్రి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ...

● యూరియా కొరత లేదు..
● విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
● 'ఆంధ్రజ్యోతి'తో డీఏవో సత్యవాణి

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

? ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం ఎంత

! జలవనరుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 1,00,315 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. 62,390 హెక్టార్లలో వరి, 37,925 హెక్టార్లలో వివిధ రకాల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. అల్లూరు, ఇందుకూరుపేట, కొడవలూరు తదితర ప్రాంతాల్లో వరి కోతలు కూడా ప్రారంభమయ్యాయి.

? యూరియా కొరత ఉందంటున్నారు

! దాదాపు 40వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచాం. అయితే వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మోతాదు కంటే అధికంగా రైతుల వినియోగించడంతో ఈ సమస్య వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి జిల్లా అవసరాలకు మించి యూరియాను దిగుమతి చేసుకుని, సరఫరా చేశాము.

? వ్యాపారుల హవా ఎక్కువైందంటున్నారు

! అధిక ధరకు యూరియా విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. యూరియాతోపాటు మరొకటి కొంటేనే ఇస్తామని కొంత మంది అనవసరమైన ఎరువులను కూడా అంటగట్టుతున్నారన్న సమాచారం ఉంది. దీనిపై విచారణ జరుగుతోంది. యూరియా నిల్వలు, విక్రయాలకు సంబంధించి టాస్క్ ఫోర్సు బృందాల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి, చర్యలు తీసుకుంటున్నాము.

? మట్టి నమూనాల పరీక్షలు ఎంతవరకు వచ్చాయి

! జిల్లాలో 31,231 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటిదాకా 32వేల వరకు సేకరించాము. వీటిలో 13వేల నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. అక్టోబరు నెలాఖరుకు రైతులకు ఫలితాలు అందించడమే మా లక్ష్యం. బడ్జెట్ కూడా విడుదలైంది కాబట్టి ఇబ్బందేమీ లేదు.

? ఈ-క్రాప్ నమోదు ఎప్పటికి పూర్తవుతుంది

! ఈ-క్రాప్‌నకు సంబంధించి ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్షేత్రస్థాయిలో ఎలాంటి అవకతవకలకు పాల్పడేందుకు అవకాశం లేకుండా పొలంలో పంట ఉన్నా లేకున్నా ఈ-క్రాప్ నమోదు చేసేలా యాప్‌లో మార్పులు చేశారు. దాదాపుగా 2.60 లక్షల ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేయాల్సి ఉండగా, 1.5లక్షల ఎకరాలకు పూర్తి చేశాము. సెప్టెంబరు 15లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. సమయానికి పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

? కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇస్తున్నారా

! జిల్లాలో 38వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలనేది లక్ష్యం. ఖరీఫ్‌లో 4,798 మందికి అందజేశాం. జిల్లాకు రబీ సీజన్ ఎంతో ప్రాధాన్యం. అక్టోబరులో రెన్యువల్స్ జరుగుతాయి. అర్హత కలిగిన కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పథకాల రాయితీలు పొందుతారు.

? డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చా!

! జిల్లాకు 41 డ్రోన్ల యూనిట్లు కేటాయించగా, 28 రైతు బృందాలకు డ్రోన్లను అందజేశాము. ఐదుగురు రైతులు బృందాలుగా ఏర్పడి రూ.2లక్షలు చెల్లిస్తే రూ.10లక్షల విలువైన డ్రోన్లను అందిస్తాము. పూర్తి వివరాలకు మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలి.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

అభాగ్యులకు ఆదరణేది!?

● దివ్యాంగుల సంక్షేమంలో అధికారుల నిర్లక్ష్యం
● సమన్వయ సమావేశాల నిర్వహణలో వైఫల్యం
● ప్రభుత్వ నిధులు రూ.14 లక్షలు వెనక్కు
● ట్రైసైకిళ్లు తయారు చేయించలేకపోయిన వైనం
● సంరక్షకులు లేని బాలికల వసతి గృహం
● స్వయం ఉపాధి రుణాలూ కరువే..!

నెల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విధి వంచిత అభాగ్యులకు అండగా నిలవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దివ్యాంగుల సంక్షేమంలో అంతులేని అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ట్రైసైకిళ్ల తయారీకి ప్రభుత్వం నిధులిచ్చినా వాటిని ఉపయోగించుకోలేకపోవడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. అదేమాదిరిగా ఇప్పుడు బాలికల వసతి గృహం విషయంలోనూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. నెల్లూరులోని ఈ వసతి గృహాన్ని చూసుకునేందుకు ఒక్కరంటే ఒక్క కేర్ టేకర్ కూడా లేరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆఖరుకు యూడీఐడీ కార్డులపై అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించడంలో గానీ, రెగ్యులర్‌గా లైన్ డిపార్టుమెంట్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించి దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలోగానీ దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మానసిక, శారీరక దివ్యాంగులైన బాలికల కోసం నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఓ హాస్టల్ ఉంది. ప్రస్తుతం ఇక్కడ 20 మంది వరకూ అభాగ్యులున్నారు. అయితే వీరికి కేర్ టేకర్‌గా ఉండాల్సిన నర్సు, వార్డెన్ ఇద్దరూ లేరు. ఏదైనా జరగరానిది జరిగితే ఆ దివ్యాంగులకు దిక్కెవరన్న ప్రశ్న తలెత్తుతోంది.



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమానికి రూ.14 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో 200 ట్రైసైకిళ్లు తయారు చేసి పంపిణీ చేయాలని ఆదేశించింది. అయితే ఈ ప్రక్రియ జరగలేదు. అధికారులు టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్న కారణంతో మిన్నకుండిపోయారు. చివరకు ఆర్థిక సంవత్సరం ముగియడంతో ఈ ఏడాది మార్చి ఆఖరుకు ఆ నిధులన్నీ వెనక్కు వెళ్లిపోయాయి. ఆ తర్వాత హడావిడిగా రాష్ట్ర అధికారులకు లేఖలు రాసి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా నెల్లూరులో ఉండే ట్రైసైకిళ్ల తయారీ కేంద్రం మూతపడింది. అయితే కూటమి ప్రభుత్వం నిధులిచ్చినా ఈ కేంద్రాన్ని తిరిగి తెరిపిద్దామన్న ఉద్దేశం అధికారులకు లేకుండా పోయిందని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కార్యాలయంలో తమకు గౌరవం ఉండడం లేదని, కనీసం ఏదైనా సమస్య మీద వెళితే గైడ్ చేసే పరిస్థితి కూడా లేదని వాపోతున్నారు. యూనిక్ డిసేబులిటీ ఐడీ కార్డ్ దరఖాస్తుల విషయంలో ఇదే జరుగుతోందని చెబుతున్నారు. కాగా గడిచిన ఏడాది కాలంలో దివ్యాంగులకు ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదు. సాధారణంగా ప్రతీ ఏటా ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద దివ్యాంగుల స్వయం ఉపాధికి రుణాలు మంజూరు చేస్తుంటారు. అయితే ఈ రుణాలపై కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని దివ్యాంగులు వాపోతున్నారు.

హాస్టల్‌ను నేనే చూసుకుంటున్నా

నెల్లూరులోని బాలికల వసతిగృహంలో ఉండాల్సిన నర్సు, వార్డెన్ ఇద్దరూ లేరు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేశాను. ప్రస్తుతం ఆ హాస్టల్‌ను నేనే చూసుకుంటున్నా. ట్రైసైకిళ్ల తయారీ కోసం వచ్చిన నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో వాటిని మళ్లీ ఇవ్వాలంటూ రాష్ట్ర ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఇంకా అక్కడి నుంచి స్పష్టత రాలేదు.

- అయూబ్ ఖాన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ

సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి పరిశీలన

సంగం, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సంగం కొండ వద్ద, సిద్దీపురం సబ్‌స్టేషన్ పరిధిలో పడమటిపాళెంలో ఖాళీ ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీ సతీష్ మాట్లాడుతూ ప్రతి మండ లంలో సుమారు 5 ఎకరాల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటుచేసి రెండున్నర మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశించింది. ఇందుకు అయ్యే నూరుశాతం ఖర్చు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఆమేరకు తహసీల్దారు సోమ్లానాయక్‌ను కలిసి స్థలం కోసం ప్రతిపాదించగా రెండు గ్రామాల్లో చూపించా రన్నారు. ఈ రెండింట్లో అనువైన స్థలంలో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ మన్మధరావు, రెవెన్యూ సిబ్బంది, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిపోగు బాలయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో సోమవారం పార్టీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో నాయకులు వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం తమవంతు చేయూతగా ఆయనతో పాటు గ్రామ పార్టీ అధ్యక్షుడు పొద మాధవరావు, మాజీ సర్పంచు అంద్రా బాలగురవారెడ్డి రూ. 15వేలు నగదును అందజేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9979
వెండి కిలో ధర	రూ. 126100
వెండి ఒక గ్రాము	రూ. 129.10

బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు మార్జిన్ల ఆక్రమణ

●ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారుల అవస్థలు ● ఆక్రమణలు పట్టించుకోని అధికారులు



సంగం బస్టాండ్ సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

సంగం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాలుగు మండలాల ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే సంగం బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు మార్జిన్లు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంగం బస్టాండు ఇటు పొదలకూరు, చేజర్ల అటు ఏఎస్‌పేట, కలిగిరి మండలాలతోపాటు సంగం మండల ప్రజలకు ప్రయాణ కూడలి. రాష్ట్రంలోని తిరుపతి, కడప, చెన్నై, ఒంగోలు తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే నాలుగు మండలాల ప్రయాణికులు సంగం వచ్చి వెళతారు. బస్సుల రాకపోకలతోపాటు ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీ, ఆటోలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణికులకు కీలకమైన సంగం బస్టాండ్ రహదారి మార్జిన్ అంతా ఆక్రమణకు గురైనా రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రహదారికి పడమర వైపు డ్రైనేజీని సైతం ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో బస్సుల కోసం వేచి ఉండేందుకు జానెడు స్థలం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లో ఉన్న దుకాణాలను తొలగించి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంగం గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.



గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు

● గోపి శ్రీనివాస్, ఎంపీడీవో

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శుల ద్వారా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎంపీడీవో గోపిశ్రీనివాస్ తెలిపారు.

? గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గ్రామ పంచాయతీల్లో ప్రతినిత్యం గ్రీన్ అంబాసిడర్ల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించడం జరుగుతోంది.

? పీజీఆర్ఎస్‌లో అధికారులు ఎందుకు కనిపించడం లేదు.

! ప్రతి సోమవారం కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. పలు శాఖల అధికారులు గైర్హాజరవుతున్న విషయం వాస్తవమే. మరోమారు అలా జరిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

? సచివాలయ ఉద్యోగులపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! ప్రతిఒక్కరూ ఖచ్చితంగా సమయపాలన పాటించేలా చూస్తున్నాం. ప్రతి నిత్యం తనిఖీలు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై నిబంధనల మేరకు చర్యలు చేపడుతున్నాం.

గత ప్రభుత్వంలో మాదిరిగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడను

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మాదిరిగా తాను ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడే వ్యక్తిని కాదని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం స్వగ్రామమైన యర్రంరెడ్డిపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నానన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో రూ. 50కోట్ల నిధులతో 750 సిమెంటు రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు తోడు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. అలాగే తన ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే కాకముందే 29వేల మందికి ఆరోగ్య సంజీవని ద్వారా వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ఆ కార్యక్రమాన్ని త్వరలోనే తిరిగి ప్రారంభించేందుకు ప్రణాళికలు చేస్తు న్నానన్నారు. వింజమూరులో అన్న క్యాంటీన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం రూ.46 లక్షలతో చేపట్టిన సిమెంట్‌రోడ్ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. తొలుత ఆలయాల్లో పూజలు నిర్వహించి పించన్లు పంపిణీ చేయడంతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధు సూదనరావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జై లక్ష్మీనారాయణ, సొసైటీ, గండిపాళెం ప్రాజెక్టు ఛైర్మన్లు గుర్రం గోపి, అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, జనసేన కన్వీనర్ పఠాన్ రసూల్, సందిరెడ్డి మాలకొండయ్య, చంద్ర వెంకయ్య, మాగంటి శాంతి, వేమూరి భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



సంతాపం వ్యక్తం చేస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యానియన్ రోడ్డుకు చెందిన షేక్ సమీవుల్లా అనే విద్యార్థి విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో మండల వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కల్లూరి రమణారెడ్డి, దస్తగిరిఅహ్మద్, షేక్ షంషీర్, నారపరెడ్డి, ఎంఎ సలీం, గురవయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

స్థానిక నార్త్ పాఠశాలలో 5వ తరగతి చదువుతూ విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సమీవుల్లా మృతికి సోమవారం పాఠశాలలో సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవోలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జాఫర్‌మొహిద్దీన్, సలీం, గౌస్‌బాషా, ఉపాధ్యాయులు సమీవుల్లా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పేదలకు పక్కాగృహాలు మంజూరు చేయాలి : సీపీఐ



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు

ఆత్మకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం, పక్కాగృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంతవరకు మంజూరు చేయలేదన్నారు. వెంటనే అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు.

ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

ఉదయగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలని సోమవారం డిప్యూటీ తహసీల్దారు షాజియాకు ఆవాజ్ మండల కమిటీ వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు షేక్‌నాయబ్ మాట్లాడుతూ ప్రతినెలా గౌరవ వేతనం చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 15నెలల కాలంలో ఒకసారి మాత్రమే 6నెలల గౌరవ వేతనం ఇచ్చిందన్నారు. 9 నెలలుగా ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. అలాగే మేనిఫెస్టోలో 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్ ఇస్తామని ప్రకటించి ఇంతవరకు దాని ఊసే ఎత్తలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గౌరవ వేతనాలు చెల్లించడంతోపాటు 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

● భయాందోళనలో ఉద్యోగులు



శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం

సీతారామపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తాహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 1991లో అప్పటి భూగర్భ జలవనరుల శాఖామాత్యులు మాదాల జానకి రామ్, జిల్లాపరిషత్ అధ్యక్షుడు డేగా నారసింహారెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించారు. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. చెదలు పట్టి కిటికీలు పాడైపోయాయి. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులే కాకుండా ప్రతి రోజు తాహసీల్దార్ కార్యాలయానికి పలు సమస్యలపై వస్తుంటారు. ఏ సమయంలో శ్లాబ్ పెచ్చులు ఊడి ఎవరి మీద పడిపోతాయేమోనని ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు భయపడుతున్నారు. వర్షాలు పడినప్పుడల్లా వర్షం నీరు భవనంలోకి వచ్చేస్తుందని, కంప్యూటర్లపై కవర్లను కప్పాల్సి వస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన తాహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

దళిత యువకుడిపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి



నాగార్జునను పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మర్రిపాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు పందింటి అంబేడ్కర్ మాదిగ డిమాండ్ చేశారు. ఇటీవల మర్రిపాడు మండలం కోనసముద్రంలో జరిగిన దాడిలో గాయపడిన నాగిపోగు నాగార్జునను సోమవారం ఎంఆర్‌పిఎస్ నాయకులు పరామర్శించారు. అనంతరం మర్రిపాడు మండల కేంద్రంలో వారు మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా పందింటి అంబేడ్కర్ మాదిగ మాట్లాడుతూ తన ఇంటి ముందు సిమెంట్ రోడ్డు నిర్మించాలని అడిగినందుకు నాగరాజుపై దాడి చేశారన్నారు. దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, రమణమ్మ మాదిగ, తిరుపతయ్య మాదిగ, అడివయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలతో నిండిన పంట కాలువలు

● సాగునీరు అందక రైతుల అవస్థలు



పిచ్చిమొక్కలతో నిండి వున్న పంటకాలువ

వింజమూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంట కాలువలు పిచ్చి మొక్కలతో నిండి సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పంట కాలువలు ఆక్రమణకు గురయ్యాయని, ఉన్న కాలువలు చెత్తాచెదారం చేరి అడవిలా తయారవుతున్నాయని, వర్షాకాలంలో నీరుపోయే మార్గంలేక ఇళ్లలోకి చేరుతుందని ప్రజలు వాపోతున్నారు. గత నెలలో కురిసిన వర్షానికి గంగమెట్ట పోస్టాఫీస్ వీధి జలమయమై కాలువల వెంబడి ఉన్న ఇళ్లలో నీరు చేరిందని, అప్పుడు అధికారులు వచ్చి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి పట్టించుకున్న పాపానపోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తి గదుల్లోనే విద్యా బోధన



అసంపూర్తి గదుల్లోనే విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

సంగం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ జనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత ప్లస్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం నిధుల కొరతతో అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో అసంపూర్తి గదుల్లోనే ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలో 6 నుంచి 10 తరగతి వరకు 230 మంది విద్యార్థులు ఉన్నారు. వీరు కాకుండా ప్లస్ పాఠశాల కావడంతో ఇంటర్మీడియట్‌లో మరో 17 మంది విద్యార్థులున్నారు. ప్రతి తరగతిలో రెండు సెక్షన్లు ఉన్నాయి. దీంతో తరగతి గదుల కొరత ఉంది. దీంతో నాడు- నేడు మన బడి పథకంలో రెండు అదనపు గదులు, ఒక వంట గదికి నిధులు మంజూరయ్యాయి. శ్లాబు వరకు పనులు పూర్తిచేశారు. ఇంకా తలుపులు, కిటికీలు, కరంటు తదితర పనులు చేయాల్సి ఉంది. ఏడాదిగా అసంపూర్తిగా ఉండడంతో తరగతి గదుల కొరతతో అసంపూర్తి గదుల్లోనే విద్యా బోధన చేస్తున్నారు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలని అటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్


ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయినికి సన్మానం



ఉపాధ్యాయురాలు రాజేశ్వరిని సన్మానిస్తున్న ఎంఈవోలు

ఏఎస్ పేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు తాటిపర్తి రాజేశ్వరికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎసి కాలనిలోని ఎంపిపి స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఆమె ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఎంఈవోలు జ్యోతి, సాయిప్రసాద్ పలువురు ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు.

తెలుగు ఉపాధ్యాయుడికి..



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న టీచర్లు

అనంతసాగరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకల మర్రి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు శివశంకరయ్యను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. శంకరయ్య తెలుగు విశ్వవిద్యాలయం నుంచి తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా కీర్తిపురస్కారాన్ని అందుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, మదిన తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

ఉదయగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద మంగళవారం నిర్వహించే దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పంట కాలువల్లో పూడిక తీయండి

సంగం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంట కాలువల్లో పూడిక తీయాలని వైసీపీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఆమేరకు తహసీల్దారు సోమ్లా నాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

స్కూల్ బస్సు, బైక్ ఢీ

● భర్త దుర్మరణం, భార్యకు గాయాలు



సంఘటన స్థలంలో షేక్ ఖాసిమ్ మృతదేహం

ఆత్మకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంబాయి జాతీయ రహదారిపై కరటంపాడు వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు స్కూలు బస్సును మోటారు బైక్ ఢీకొనడంతో మోటారు బైక్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందగా వెనుక కూర్చున్న భార్యకు స్వల్ప గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు... ఉదయగిరి మండలం వెలుతూరు గ్రామానికి చెందిన షేక్ ఖాసిమ్(35), అతని భార్య హజరత్‌బీ మోటారు బైక్‌పై ఆత్మకూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కరటంపాడు వద్ద ఆత్మకూరుకు చెందిన స్కూలు బస్సు కరటంపాడు గ్రామంలోకి క్రాస్ అవుతుండగా ఎదురుగా వచ్చిన మోటారు బైక్ ఢీకొంది. దీంతో మోటారు బైక్ నడుపుతున్న భర్త ఖాసిమ్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య హజరత్‌బీకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమర్టం నిమిత్తం ఖాసిమ్ మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి స్థానిక ఉదయగిరి రోడ్డులో బుడంగుంట క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి పట్టణం బుడంగుంటకు చెందిన గొల్లపూడి రామకృష్ణ(78) ఆదివారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని ముసునూరులో ఉన్న తమ కుమార్తె గోసల జ్యోతి వద్దకు వెళ్లేందుకు బయలుదేరాడు. ఉదయగిరి రోడ్డులో బుడంగుంట క్రాసింగ్ వద్ద వాహనం కోసం నిలబడి ఉండగా జలదంకి వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రక్ వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బలమైన గాయాలైన ఆయనను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమార్తె జ్యోతి ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు వ్యక్తి ...

ఉదయగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి గ్రామానికి చెందిన రాజుపాళెం వెంకటేశ్వర్లు (50) పాము కాటుకు గురై మృతిచెందాడు. ఎస్ఐ కర్నాటి ఇంద్ర సేనారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశ్వర్లు గ్రామంలో ఇస్త్రీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ తరుణంలో పనిచేసి అక్కడే నిద్రించేవాడు. ఆదివారం పాము కాటుకు గురికావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలించగా అక్కడ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించినట్లు ఎస్ఐ ఇంద్ర సేనారెడ్డి తెలిపారు.

నారాయణప్పపేటలో చోరీ



చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

సీతారామపురం, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ లోని నారాయణప్ప పేట గ్రామ ఎస్సీ కాలనీలో శీలం రామచంద్రయ్య, మల్లాపు రం చెన్న కేశవులు ఇళ్ళలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.67 వేల నగదు అపహరించినట్లు బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాము పదిరోజుల క్రితం ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైకు వెళ్లి సోమవారం ఉదయం ఇళ్లకు తిరిగివచ్చామన్నారు. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటి తాళాలు పగులగొట్టి వస్తువులను చెల్లాచెదురుగా పడేసి సూట్‌కేస్‌లోని విలువైన పత్రాలతోపాటు నగదును తీసుకెళ్ళారని వాపోయారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవలాలగడ్డకు చెందిన షేక్ గాజుల ముంతాజ్ అనే మతిస్థిమితం లేని మహిళ గతనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

దళారుల దోపిడీ నుంచి ఆదుకోండి

● ధాన్యం ధరలపై రైతుల గగ్గోలు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అల్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రెండో కారు పంట దిగుబడి సమయంలో దళారుల దోపిడీ నుంచి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. దళారులు చేస్తున్న మోసానికి గురై తీవ్రంగా నష్టపోతున్నామంటూ సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీయూ 1010 రకం ధర రూ.15,500 ఉండగా సన్నాల ధరలు రూ.16,200కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల్లో రూ.17 వేలకు పైగా కొనుగోలు చేస్తున్న తరుణంలో మండలంలో మాత్రం దళారులు తమ ఇష్టారాజ్యంగా ధరలను దిగజార్చుతున్నారి వాపోయారు. ఇలా చేస్తే తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు యరటపల్లి శేఖర్‌రెడ్డి, మోమిడి మాధవరావు, ఆట తిరుమల, పప్పు సుధాకర్, రంజిత్, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 560

తాత్కాలికంగా నిలిచిన ఆధార్ సేవలు

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 20 రోజుల క్రితం జిల్లా ఐటీడీఏ పీడీ ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. వారం రోజుల క్రితం ఆధార్ కేంద్రంలో పనిచేసే ఆపరేటర్ రోడ్డు ప్రమాదానికి గురై వైద్యశాలలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుం టున్నారు. దీంతో ఆధార్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



అంతర్గత రోడ్లకు మహర్దశ!

● సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు ● రూ.17.61 కోట్లతో 185 పనులు ● 'ఉదయగిరి' పల్లెలకు పండుగ



చిరుజల్లులకే బురదమయంగా మారిన తూర్పుఎర్రబల్లి పంచాయతీ మన్నంవారిపల్లె రోడ్డు

కొండాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీ ణ ప్రాంతాల్లో చినుకుపడితే చిత్తడిగా మారి ప్రజ లకు ఇబ్బందులు కలిగిస్తున్న అంతర్గతరోడ్లకు మహర్దశ పట్టనుంది. ఉదయగిరి నియోజకవర్గం లోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పల్లెకు పండగ కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ.17.61 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు దర్శనమిస్తాయి.

● నియోజకవర్గంలో 185 పనులు

ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో అంతర్గత రోడ్లు ఎక్కువ భాగం ఇప్పటికీ మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షాకాలంలో చిరుజల్లులకే రోడ్లు చిత్తడిగామారి ద్విచక్రవాహనాలపైనే కాకుండా కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో గ్రామాల్లో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లగా మార్చేందుకు ప్రభుత్వం విరివిగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయడంతో ఉపాధి హామీ కూలీలకు వేతనం లభిస్తోంది. మంజూరైన 185 పనులు, నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

నెం	మండలం	మంజూరైన పనులు	నిధులు(రూ.కోట్లలో)
1.	కొండాపురం	31	2
2.	కలిగిరి	16	2.12
3.	జలదంకి	21	2
4	వింజమూరు	25	1.80
5.	దుత్తలూరు	24	2
6.	ఉదయగిరి	23	2.1
7.	సీతారామపురం	19	1.46
8.	వరికుంటపాడు	26	3.6

త్వరలో పనుల ప్రారంభిస్తాం

మంజూరైన నిధులతో త్వరలో పనులు ప్రారంభిస్తాం. గతేడాది చేసిన పనులకు సంబంధించి 40 శాతం నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన నిధులు త్వరలోనే విడుదల చేస్తుంది. పనులను ప్రారంభించి వీలైనంత త్వరలో పూర్తి చేస్తాం.

- సీహెచ్.మణికుమార్, డీఈ, పీఆర్

వైసీపీ ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు

● అర్హులందరికీ పింఛన్లు
● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఫేక్ ప్రచారాలను నమ్మవద్దని, పేదప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న టీడీపీ ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు ఇచ్చితీరుతుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పట్టణంలోని 7వ వార్డులో సోమవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ఏ ఒక్కరి పేర్లను తొలగించలేదని, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంకు భంగం కలిగించేందుకు వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి అర్హుల పింఛన్లు తీసివేస్తున్నట్లుగా ప్రచారం చేస్తూ కొత్త డ్రామాలకు తెరతీస్తున్నాడని విమర్శించారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శాలువాతో సత్కరించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ గౌస్‌బాషా, ఉన్నం భాస్కర్, షేక్ రూబీ, సయ్యద్ అహ్మద్‌బాషా, మున్నా, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు పట్టణంలోని 7వ వార్డులో పింఛను నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

అభివృద్ధికి ఆధ్యుడు చంద్రబాబు

ఆంధ్రరాష్ట్రాన్ని ఆధునికతవైపు నడిపిస్తున్న దార్శనికుడు చంద్రబాబు అని, తెలుగు రాష్ట్రాలలో అభివృద్ధికి ఆయనే ఆద్యుడని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు స్వీకరించి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 73 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.43.07 లక్షల చెక్కులను, 3లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే ఇంటూరి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, పూరిమిట్ల గురునాథం, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

జీ.మేకపాడును కనిగిరి నియోజకవర్గంలో కలపండి

కందుకూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో ఉన్న జీ.మేకపాడు గ్రామాన్ని జిల్లాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా కనిగిరి నియోజకవర్గంలో కలిపేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామసర్పంచు గూడపాటి బ్రహ్మయ్య, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. మా గ్రామం మండల కేంద్రమైన కందుకూరుకు 45 కిలోమీటర్ల దూరంలో, నియోజకవర్గ కేంద్రమైన కనిగిరి పట్టణానికి అతి సమీపంలో ఉందన్నారు. దీంతో ఏ పనిమీద కందుకూరుకు రావాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నామని, దీంతో కనిగిరి నియోజకవర్గంలో కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్కిరెడ్డి సుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఉప్పతి శ్రీనివాసులురెడ్డి, దాదాని వెంకటేశ్వర్లు, నేలపాటి దావీదు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీబీ జానమ్మ గంధమహోత్సవం

కొండాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవోలులో బీబీ జానమ్మ దర్గాలో ఆదివారం రాత్రి గంధమహోత్సవం ఘనంగా జరిగింది. కొమ్మికి చెందిన షేక్ ఖాజావలి ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా ముస్లింలు గంధాన్ని దర్గాకు తరలించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముజావర్లు గంధాన్ని బీబీ జానమ్మకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అగ్రిమెంట్‌పై కొనుగోలు భూములకు 1బీ ఇవ్వాలి

బిట్రగుంట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అగ్రిమెంట్‌పై భూములు కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు 1బీ, అడంగలు అందచేయాలని టీడీపీ రైతునేత దేవరాల తిరుపతియాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో దాదాపు చిన్నకారు రైతులు చాలా మంది అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసి భూముల్లో వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి 1బీ, అడంగలు అందచేసినట్లైతే ప్రభుత్వం అందచేసే రాయితీలు ఉపయోడపడతాయన్నారు. ఆయన వెంట కొల్లా రవీంద్రబాబు, ప్యాట్రిక్, శ్రీనివాసులు, బుర్రి వెంకట్రావు, ఎం.ఇజ్రాయేల్ తదితరులు ఉన్నారు.

గుడ్లూరు పథకం నుంచి ఆగిన మంచినీటి సరఫరా

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపవనికి గుడ్లూరు మంచినీటి పథకం నుంచి ఆరు రోజులుగా మంచినీటి సరఫరా ఆగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, చేతి పంపుల నీటితో తమ అవసరాలను తీర్చుకుంటున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

కావలి(టౌన్), సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా తోట వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధానోపాధ్యాయులు పీవీ రమణ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వెంకటేశ్వర్లు పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సహచర ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి అభినందించారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



గ్రామోత్సవంలో పూజలందుకుంటున్న గణనాథుడు

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు సోమవారం నిమజ్జనానికి తరిలాయి. మండలంలోని అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం గ్రామాలలోని వినాయకుని విగ్రహాలను భక్తులు అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. అనంతరం రాళ్లపాడు ప్రాజెక్టు, స్థానిక చెరువులలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

సందడిగా గణనాథుడి నిమజ్జనం



గణేశ్ మహరాజ్ ఉత్సవంలో నృత్యం చేస్తున్న యువత

బిట్రగుంట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో సోమవారం గణేష్ నిమజ్జనం సందడిగా జరిగింది. ఎస్వీపాలెం పంచాయతీలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆక్వా గణేష్ విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. వెంకటేశ్వరపురం, ఎస్వీపాలెంలో గణేష్ విగ్రహాల ఊరేగింపు అనంతరం తాటిచెట్లపాలెం సముద్రతీరానికి తరలించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వా గణేష్ కమిటీ సభ్యులు కే.కృష్ణప్రసాద్‌రెడ్డి, ఆర్.భానుచంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఏ.నాగేంద్ర, పీ.రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ చానల్ పనుల్లో అవకతవకలపై

విజిలెన్స్ విచారణ జరిపించాలి

● ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దగదర్తి- రాచర్లపాడు(డీఆర్) చానల్ పనుల్లో పాత ప్రతిపాదనలు మార్చి జరుగుతున్న అవకతవ కలపై విజిలెన్స్ విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్ కార్పొరే షన్ (ఏఐడీ) చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కావలి జలవనరు లశాఖ ఇన్‌చార్జి ఈఈ ఖాన్‌ను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 3 మండలాల పరిధిలోని 23 గ్రామాల్లో 23 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ కాలువ నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై ఇప్పటికే జలవనరులశాఖ ఈఈ, ఎస్ఈ, సీఈలకు వినతిపత్రాలు అందించానని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కాలువకు గత టీడీపీ ప్రభుత్వంలో రూ.30 కోటను సీఎం చంద్రబాబునాయుడు మంజూరు చేయగా అప్పట్లో జీరో నుంచి 6.7 కి.మీ వరకు కాలువకు కాంక్రీట్ గోడలు నిర్మించేలా ప్రతిపాదనలు చేశారన్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో దానిని నిర్లక్ష్యం చేశారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాతప్రతి పాదనలను కాంట్రాక్టర్లకు అనుకూలంగా మార్చించుకుని కొత్త ప్రతిపాదనలు పంపి నాసిరకంగా పనులు చేస్తున్నందున రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. డీఆర్ చానల్ బాగుంటేనే డీఎం చానల్‌కు నీరు వస్తోందని చెప్పారు. కాలువపై బ్రిడ్జీలు కట్టకుండా సైపన్‌లు కట్టాలని అప్పుడే రైతులకు సక్రమంగా నీరు పారుతోందన్నారు. ఒక రైతుగా కాలువ నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై తాను పోరాడుతానన్నారు.



కావలి ఇన్‌చార్జి ఈఈ ఖాన్‌తో మాట్లాడుతున్న సుబ్బానాయుడు

రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదపవని రోడులో 15 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం తక్షణం పూర్తి చేయాలని వామపక్షాల నాయకులు కోరారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం వామపక్షాల నాయకులు కావలి ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేసి ఉన్నారని, రైల్వే శాఖ తన పరిధి వరకు వంతెన నిర్మాణం పూర్తి చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సిన వంతెన ను గత వైసీపీ ప్రభుత్వం, నిర్లక్ష్యం చేయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం ఉదయగిరి రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వాహనాల రద్దీ పెరిగి అది దెబ్బతింటుందన్నారు. పొరపాటున అది దెబ్బతింటే ప్రత్యేమ్నాయ రాకపోకలకు ఎలాంటి మార్గాలు లేవన్నారు. వెంటనే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా స్వామిక హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ కరువది భాస్కర్, దామా అంకయ్య, సభ్యులు వై. కృష్ణమోహన్, బోసు, దర్గాబాబు, ఆమంచి సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న వామపక్షాల నాయకులు

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆక్రమణలు

లింగసముద్రం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సత్యనారాయణపురంకు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడ్డారు. దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు నిర్మాణం చేపట్టి పరిశోధన కేంద్రానికి చెందిన పంట కాలువలో సిమెంటు పైపులు వేశారు. కేంద్రానికి చెందిన ఇనుప ఫెన్సింగ్‌ను తొలగించారు. పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న వారి పొలాల్లోకి వెళ్లేందుకు ఈ విధంగా ఆక్రమణలకు పాల్పడ్డారని అధికారులు తెలిపారు. అయితే వారి పొలాల్లోకి వెళ్లేందుకు ఉన్న రోడ్డును వారి పొలాల్లో కలుపుకొని, పరిశోధనా కేంద్రంలో రోడ్డును దౌర్జన్యంగా వేశారని చెప్పారు. కాగా 2021 జనవరి 7న అప్పటి ప్రభుత్వం ఈ వ్యవసాయ విత్తనాభివృద్ధి క్షేత్రం భూములలోని 540 ఎకరాలలో సుమారు 410 ఎకరాలను అపరాలు, చిరుధాన్యాల పరిశోధనా కేంద్రం ఏర్పాటు కోసం ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్శిటీకి బదలాయించిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ పనులు జరుగుతున్నాయి.



వ్యవసాయ పరిశోధన కేంద్రం పంట కాలువలో వేసిన సిమెంటు పైపులు

ఆక్రమణలు తొలగించండి

మండలంలోని చినపవని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆక్రమణలు తొలగించాలని ఆ కేంద్రం ఇన్‌చార్జ్, సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, సైంటిస్టు నాగార్జున కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో తహసీల్దారు ఎం.కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పరిశోధన కేంద్రానికి సమీపంలోని సత్యనారాయణపురంకు చెందిన కొందరు బలవంతంగా పరిశోధన కేంద్రం ఉత్తరం-పడమర దిక్కుల మధ్యలో ఉన్న ఫెన్సింగ్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి, ఇరిగేషన్ కాలువపై సిమెంటు పైపులు వేసి, పరిశోధన కేంద్రంలోకి అక్రమంగా ప్రవేశించి రోడ్డు వేశారని చెప్పారు. ఇది తీవ్ర అభ్యంతరకరమని, అలాగే పరిశోధన కేంద్రం నిబంధనలను అడ్డుకోవడమేనని చెప్పారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నాగార్జున

రెండు మూడు రోజుల్లో కరేడుకు వస్తా

● బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్



కరేడు వాసులతో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

ఉలవపాడు, సెప్టంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజుల్లో కరేడును సందర్శించి ఇండోసోల్ భూసేకరణ బాధితులతో మాట్లాడతానని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ కరేడు రైతులకు భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడ నుంచి పుంగనూరు వెళుతూ మార్గమధ్యంలో కరేడు రైతులను కలుసుకుంటానని ముందస్తు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుని జాతీయ రహదారి నుంచి కరేడుకు వెళ్లే ప్రధాన రహదారి వద్ద కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పోలీసు బలగాలు మోహరించాయి. విషయం తెలుసుకున్న రామచంద్రయాదవ్ ప్రకాశం జిల్లా సింగరాయకొండ బైపాస్ కే బిట్రగుంట దాబా దగ్గర ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్నందున కొత్త వ్యక్తులు రావడం, సమావేశాలు నిర్వహించడం నిషేధం కావడంతో సుమారు 100 మంది రైతులు ఆయనను సింగరాయకొండ బైపాస్ దాబా వద్ద కలిసి మాట్లాడారు. రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా చట్టబద్ధంగా అన్ని అనుమతులతో రెండు మూడు రోజుల్లో కరేడులో పర్యటించి బాధితులకు అండగా నిలుస్తానని చెప్పారు. కరేడు రైతుల భూపోరాటంలో ఎంతదూరమైనా పోరాడి ఇండోసోల్ కంపెనీకి ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తున్న భూములను ఇవ్వకుండా అడ్డుకుంటానని స్పష్టం చేశారు.

పలువురికి సన్మానం

బిట్రగుంట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో నూతనంగా ఎంపికైన పలువురిని టీడీపీ మండల కన్వీనరు మాలేపాటి నాగేశ్వరరావు సోమవారం సన్మానించారు. ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, కావలి ఏఎంసీ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన లేళ్లపల్లి సుధీర్‌బాబు, గణేషం రమేష్ రెడ్డి, జమున ఎల్లమ్మలను శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వరరెడ్డి, శివకోటయ్య, చిలకజానకి రామయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ఎదుట యథేచ్ఛగా ఆక్రమణలు

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పలు శాఖల కార్యాలయాల సముదాయంతో ఉన్న కావలి తహసీల్దారు కార్యాలయం ఎదుట రోడ్డు వెంబడి ఆక్రమించి బొంకులు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ తహసీల్దారు, సబ్‌రిజిస్ట్రార్, వ్యవసాయశాఖ డివిజన్, మండల శాఖ కార్యాయలయాలు, రూరల్ పోలీస్‌స్టేషన్, సర్కిల్, ఉపఖజానా, సబ్‌జైలు కార్యాలయాలు ఒకే సముదాయంలో ఉన్నాయి. అయితే ఆ కార్యాలయాలు కనిపించకుండా వాటి ముందు బొంకులు వెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఆ కార్యాలయాలలో ప్రధానంగా రెవెన్యూ, పోలీస్‌శాఖలు ఉన్నప్పటికీ ఆక్రమణలను ఎందుకు నివారించలేకపోతున్నారో అర్థం కావడంలేదని స్థానికులు అంటున్నారు. కార్యాలయాల ముందు బొంకులు వెలవడంతో ఆయా కార్యాలయాలు పూర్తిగా కనిపించకుండా పోయాయి. దీంతో ఆయా కార్యాలయాలకు పనులుపై వచ్చిన వ్యక్తులకు కార్యాలయాలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ కార్యాలయాల ముందు వెలిసిన ఆక్రమణల వలన కార్యాలయాల వాతావరణమే కనిపించకుండా అక్కడ అపరిశుభ్రంగా తయారయ్యాయి. అక్కడ ఆక్రమణదారుల ను రెవెన్యూ అధికారులు ఎవరైనా ప్రశ్నిస్తే తాము మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నామని చెపతున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి తహసీల్దారు కార్యాలయ సముదాయం ముందు ఉన్న ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.





తహసీల్దారు కార్యాలయం ప్రధానగేట్ ఉత్తర, దక్షణం వైపున వెలిసిన బంకులు

ఇండోసోల్‌లో ఉద్యోగ అర్హత పొందిన వారికి శిక్షణ

కావలి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీలో ఉద్యోగ అర్హత పొందిన వారికి నైపుణ్యాభివృద్ధిపై మండలంలోని రుద్రకోట పాలటెక్నిక్ కళాశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. గతనెల 20వ తేదీన గుడ్లూరు మండలం చేవూరు వేదికగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 70 మంది ఉద్యోగ అర్హత లెటర్స్ పొందారు. వారికి నెల్లూరు స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇండోసోల్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణ 30 రోజుల పాటు కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్‌ఖయూం, పాలటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుశీలకుమార్ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బన్న, ఇండోసోల్ కంపెనీ ప్రతినిధులు పీ.రాజశేఖర్, సుబ్బారావు, హరీష్, భారతి, సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్స్ లావణ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండోసోల్ సంస్థ ప్రతినిధి



తిరుపతిలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పింఛన్ల పంపిణీలో జిల్లాకు ప్రథమ స్థానం

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో తిరుపతి జిల్లాకు ప్రథమస్థానం దక్కింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు.. 2,63,350మందికి గాను 2,49,025మందికి (94.56 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కాగా, పింఛన్ల పంపిణీలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



మరో 20 ఏళ్లు సీబీఎన్నే సీఎం

సీఎంగా చంద్రబాబు నాయుడి ప్రస్థానం 30 ఏళ్ల పూర్తయింది. మరో 20 ఏళ్లు ఆయనే సీఎంగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే, ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ అన్నారు. సీబీఎన్ సీఎంగా 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వేయి కళ్ల దుత్తలతో సోమవారం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మకు టీడీపీ నేతలు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నేతలు బ్యాంకు శాంతమ్మ, అనిత, హేమ, రేవతి, యశోద తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సేవతోనే ఆత్మ సంతృప్తి

- పేదలకు గౌరీశంకర్ చేస్తున్న సేవలు ఆదర్శనీయం
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పవరపు వెంకయ్యానాయుడు

పెళ్లకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే రెండో అత్యున్నత రాజ్యాంగబద్ధమైన ఉప రాష్ట్రపతి పదవి కన్నా, స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా పేదలకు అందించే సేవలే తనకు ఆత్మ సంతృప్తినిస్తున్నాయని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు తెలిపారు. పెళ్లకూరులో సోమవారం చాగణం లలితమ్మ-భాస్కర్‌రావు మెమోరియల్ మేనేజింగ్ ట్రస్టీ గౌరీశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. పెళ్లకూరు నుంచి గౌరీశంకర్ ఇతర ప్రదేశాలకు వెళ్లి వృద్ధిలోకి వచ్చారు. తన తల్లిదండ్రులు చాగణం లలితమ్మ-భాస్కర్‌రావు పేరిట ట్రస్టు నెలకొల్పి, తన సంపాదనలో కొంతభాగాన్ని పేదలకు ఖర్చు చేయడం స్ఫూర్తిదాయకం. గ్రామాల్లో తాగునీరు, ఉచిత వైద్యశిబిరాలు, మొక్కల పంపిణీ, పెంపకం, విద్యార్థులకు ఉపకార వేతనాలు, మొబైల్ వ్యాను ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించడం ప్రశంసనీయం' అని పేర్కొన్నారు. స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్ సెంటర్, కుట్టుమిషన్, డ్రైవింగ్ స్కూల్ తదితర కేంద్రాల ద్వారా యువతకు ఉపాధి కల్పించం అభినందనీయమన్నారు. ఇంటర్ నుంచి బీటెక్ వరకు చదివే 58మంది పేద విద్యార్థులకు రూ. 25 లక్షలు, మరో 20 మందికి రూ.10 వేలను ఉపకార వేతనాలు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి వెంకయ్యానాయుడు అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న లలితమ్మ డీ ఆడిక్షన్ సెంటర్, సేవాసదనం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లలితమ్మ డయోగ్నోస్టిక్ సెంటర్, వ్యాయామశాలతో పాటు ఉద్యానవనాన్ని వెంకయ్య నాయుడు ప్రారంభించారు. కాగా, మండలంలోని చెన్నప్పనాయుడుపేట, శిరసనంబేడు రాజుపాలెం కానూరు, రోసనూరు తదితర గ్రామాల్లో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడే వారినీ ట్రస్ట్ ద్వారా ఆదుకోవాలని మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కోరగా, చాగణం గౌరీశంకర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రంగినేని కృష్ణయ్య, శ్యామ్‌బన్సల్, చంద్రశేఖర్‌రెడ్డి, చాగణం వరలక్ష్మి, శ్రీవిన్య, కావ్య, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.


'స్వర్ణ' పంచాయతీలు

అందుబాటులోకి సరికొత్త పోర్టల్ ● ఆన్‌లైన్ విధానంతో ఇక లెక్కలు పక్కా ● అవినీతి, అక్రమాలకు ఫుల్‌స్టాప్

జిల్లాలో గ్రామ పంచాయతీలు
774
పన్నుల అసెస్మెంట్లు
3,56,669
ఏటా ఇంటిపన్ను వసూలు
రూ.39.72కోట్లు



తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పల్లెలే దేశానికి పట్టుగొమ్మలనే మహాత్ముడి భావనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. అధికారంలోకి వచ్చాక పూర్తిగా గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గత వైసీపీ పాలనలో అతీగతీలేకుండా పోయిన పల్లెల పాలనా వ్యవస్థను చక్కదిద్దాలని సంకల్పించింది. ఈక్రమంలోనే సోమవారం నుంచి 'స్వర్ణ పంచాయతీ' విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గ్రామ పంచాయతీల్లో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు, అక్రమాలను కట్టడి చేసేందుకు ఈ సరికొత్త ఆన్‌లైన్ పోర్టల్ దోహదపడనుంది.



పూర్తిగా డిజిటల్ లావాదేవీలు

జిల్లాలోని 774 గ్రామ పంచాయతీల్లోని కార్యకలాపాల్లో ఎక్కువ భాగం ఇప్పటివరకూ మాన్యువల్‌గా జరుగుతున్నాయి. రూపాయి పన్ను చెల్లించాలన్నా ప్రజలు పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సిందే. రసీదు కోసం ఇబ్బందులు పడాల్సిందే. రసీదు పొందకపోతే ఆ పన్ను ప్రభుత్వ ఖజానాకు జమయిందో లేదో అని సంశయం. తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఇలాంటి ఇబ్బందులకు చెక్ పడుతుంది. ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించే అవకాశం ఏర్పడింది. ఇంటి, కుళాయి పన్నులు, మ్యూటేషన్, ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్, బర్త్, డెత్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్ వంటి సేవలనూ ఇందులో పొందవచ్చు. పోర్టల్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు చెల్లించాక పంచాయతీ అధికారులు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో పంచాయతీకి సంబంధించి ఏరోజుకారోజు లెక్కలు ఇట్టే తెలిసిపోతాయి. లోపాలకు,అక్రమాలకు తద్వారా బ్రేకు పడుతుంది. ఇంటి యజమాని పేరు, పన్నుల సంఖ్య, నివాస ప్రాంతం గృహం, వాణిజ్య భవనమా, పారిశ్రామిక అవసరాలకు నిర్మించారా, గ్రామకంఠంలో నిర్మించారా.. అనుమతులున్నాయా తదితర పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది.

వైసీపీ హయాంలో లెక్కకు దొరకని అవినీతి

గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలను గాలికొదిలేసింది. ఆర్థిక సంఘం నిధులే కాదు ఉపాధి హామీ పనులనూ దారి మళ్లించేసింది. ఇదే అదనుగా పంచాయతీల్లో కొందరు పంచాయతీ కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లు చేతివాటం ప్రదర్శించారు. ఆస్తి పన్నులను అడ్డదారిలో బొక్కేశారు. రేణిగుంట, తిరుచానూరు. తారకరామనగర్‌తో పాటు శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల్లో సుమారు రూ.5కోట్ల మేర అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని పంచాయతీల్లో పనులు చేయకుండానే వైసీపీ నేతలు బిల్లులు పొందారనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గత అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.



పంచాయతీల్లో పారదర్శకత

గ్రామ పంచాయతీల్లో అక్రమాలకు స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఫుల్‌స్టాప్ పెడుతుంది. ఈ ఆన్‌లైన్ పద్ధతి వల్ల అక్రమాలకు, అవినీతికి ఆస్కారం ఉండదు. పంచాయతీ పన్నులతో పాటు ఆస్తుల వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. - సుశీలాదేవి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి

ఆపరేషన్ 'స్వర్ణ'

హైడ్రా తరహాలో ముందుకు పోతామన్న తుడా చైర్మన్



తిరుపతి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తున్న హైడ్రా తరహాలో 'ఆపరేషన్ స్వర్ణ' పేరిట స్వర్ణముఖి ప్రక్షాళన, పరిరక్షణకు ముందుకు వెళతున్నట్లు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి చెప్పారు. తుడా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. '130 కిలోమీటర్ల పొడవున్న స్వర్ణముఖి నదికి ఇరువైపులా వైసీపీ హయాంలో భారీగా భూములు కబ్జాచేసి అమ్మేశారు. వంకలు, చెరువులను తప్పుడు పత్రాలతో దోచుకున్నారు. ఈ క్రమంలో నదికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా తరహాలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం. స్వర్ణముఖి బఫర్‌జోన్లలో స్థలాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం' అని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రూ.40 కోట్ల తుడా నిధులతో తుమ్మలగుంటలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ కట్టారని, ఆ నిధులు పూర్తిగా వ్యర్థమైనట్లు తెలిపారు. తుడాలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తయి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. మద్యం స్కాంలో తుడా వాహనాలు వినియోగించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. 'తుడా నిధులు రూ.270 కోట్లను ఎంపీడీవో ఖాతాలకు మళ్లించి దోచుకున్నారు. తుడాలో జిరాక్స్ కాపీల నుంచి విమాన టిక్కెట్లు, వాహనాలు అంతా కుంభకోణమే. తుడాలో ఇప్పుడు పైసా కూడా లేదు. తుడా భూములను వినియోగించుకొని నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నాం' అని వివరించారు. తాను తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లో ఎన్నో సంస్కరణలు చేపట్టామన్నారు. అస్తవ్యస్త ప్లానింగ్‌తో గత ప్రభుత్వం ప్రారంభించిన తుడా టవర్స్‌ను గాడిలో పెట్టి వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. సూరప్పకశంలోని తుడా ప్లాట్ల రేట్లు తగ్గించి అమ్మకానికి వేలం నిర్వహిస్తున్నామన్నారు.

వృషభ వాహనంపై వరసిద్ధుడు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చిలుక వాహనంపై వినాయకుడు దర్శనమిచ్చారు. కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే రాత్రి నిర్వహించిన వృషభ వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరు ప్రాంతాలకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.రాత్రి వారంతా ఉభయ వరస తీసుకురావడంతో కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. వృషభ వాహనాన్ని శోభాయమానంగా అలంకరించి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను వాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం నిర్వహించనున్న రథోత్సవానికి సోమవారం రథ కలశ పూజను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గజ వాహన సేవను నిర్వహించనున్నారు.

జిల్లాలో 4252 విగ్రహాల నిమజ్జనం



కమాండ్ కంట్రోల్ సెంటర్‌నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'వినాయక చవితి సందర్భంగా జిల్లాలో 4670 విగ్రహాలను ఏర్పాటు చేశారు. సోమవారం వరకు 4252 విగ్రహాలను నిమజ్జనం చేశారు' అని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. మరో ఐదు రోజులలో 458 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీలకు సూచించారు. ఈ మేరకు ఆయా డీఎస్పీలతో ఆయన మాట్లాడి.. నిమజ్జనం జరిగే ప్రదేశాలు.. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చీకటి పడేట్లయితే నిమజ్జనం చేసే ప్రాంతంలో లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్ద పెద్ద వాహనాల్లో విగ్రహాలను తీసుకొస్తే..అందులోని ప్రజలను నదిఒడ్డున దింపాలని, ఐదుగురినే విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు అనుమతించాలన్నారు. జాతీయ రహదారులపై ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. డ్రోన్లతోనూ బీట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి సహా మిగిలిన ప్రాంతాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించిన నిర్వాహకులకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐ, డ్రోన్ టెక్నాలజీపై విస్తృత పరిశోధనలు

ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ వెల్లడి



వ్యవసాయ కళాశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ శారదా జయలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ మరింత వినియోగించే అంశంపై విస్తృత పరిశోధనలు చేస్తున్నట్టు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ శారద జయలక్ష్మి పేర్కొన్నారు. ఇందుకోసం వివిధ సంస్థలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఐసీఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ల్యాబ్, ఎగ్జామ్ ఎవల్యూషన్ సెంటర్‌లను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీ వ్యవసాయ కళాశాల అతిథి గృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా అధిక దిగుబడి సాధన. సస్యరక్షణ చర్యలపై పరిశోధనల్లో దృష్టి సారించామన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద జీవ నియంత్రణ పద్ధతులతో సస్యరక్షణ ప్రాజెక్టుకు రూ. 5.2 కోట్లు మంజూరయ్యాయన్నారు.. బ్లాక్ సోల్జర్ ఫ్లై ఫామింగ్‌ను ప్రోత్సహించడానికి ఐసీఆర్ నుంచి రూ. 20 లక్షలు మంజూరయ్యాయన్నారు. పుట్ట గొడుగుల పరిశోధనకు రూ. 502 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. ఇటీవల ఇక్కడి వ్యవసాయ కాలేజీలో పలు సదుపాయాలు కల్పించామన్నారు. హాస్టల్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశామన్నారు. సమావేశంలో కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఆర్‌ఏఆర్ఎస్ అధికారి సుమతి, పలువురు అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐకేఎస్ జాబితాలో రెండు వర్సిటీలకు స్థానం


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రెండు విశ్వవిద్యాలయాలకు ఇండియన్ నాలెడ్జ్ సిస్టం (ఐకేఎస్) గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఇందుకు సంబంధించిన జాబితాను సోమవారం విడుదల చేసింది. జాబితాలో తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉన్నాయి. ఈ గుర్తింపుతో రెండు వర్సిటీల్లో ప్రత్యేక పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు ఆర్థిక సహకారాన్ని ఐకేఎస్ అందించనుంది. తద్వారా భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు రావడానికి అవకాశం ఏర్పడింది. తాజా గుర్తింపుపై సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, ఎస్వీ వేద వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

రేషన్ డీలర్లకు కొత్త ఈ-పోస్ యంత్రాలు

- 15 నుంచి అందుబాటులోకి..



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే స్మార్టు కార్డులు పంపిణీ చేస్తుండగా.. డీలర్లకు ఈనెల 15వ తేది నుంచి అత్యాధునిక ఈ-పోస్ యంత్రాలను అందజేయనుంది. కాగా, 2015లో డీలర్లకు అందచేసిన ఈ-పోస్ మిషన్లు సక్రమంగా పనిచేయడం లేదు. నెట్‌వర్కు సిగ్నల్ లేని మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల్లో సరుకుల పంపిణీ కష్టతరంగా మారింది. ఫలితంగా పంపిణీలో తీవ్ర జాప్యం తలెత్తి కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ తరహా సమస్యలకు చెక్ పెట్టడంతో పాటు ఎలాంటి లోపాలకు తావులేని విధంగా సరికొత్తగా ఈ-పోస్ మిషన్లు ఇవ్వనున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల్లోని క్యూఆర్ కోడ్‌ను వీటితో స్కాన్ చేస్తే ఆ కార్డుదారుల వివరాలు ఈపోస్‌లో నమోదవుతాయి. ఆ ప్రకారం ఏయే సరుకులు.. ఎన్ని కిలోలు ఇవ్వాలనే వివరాలు నమోదవుతాయి. ఇక, కార్డుదారులకు వేలిముద్ర పడకుంటే కంటి పాపను స్కాన్ చేసేలా దీనిని రూపొందించారు. సిమ్, వైఫై, హాట్‌స్పాట్, బ్లూటూత్, టచ్ స్క్రీన్ వంటి సదుపాయాలతో ఆండ్రాయిడ్ సాంకేతికతతో ఇది పనిచేస్తుంది. తద్వారా వ్యవస్థలో పర్యవేక్షణ, నిఘా కట్టుదిట్టంగా ఉంటుందని డీఎస్‌వో శేషాచలం రాజు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. కార్డుదారులు తీసుకునే బియ్యం సహా సరుకుల వివరాలు, ధర తెలుపుతూ రశీదు జారీ చేస్తారన్నారు.



అమితాష్ ప్రధాన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నటులు అమితాష్ ప్రధాన్, ప్రియాంక జైన్, శివకుమార్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఉన్నారు.



ప్రియాంక జైన్, శివకుమార్

టీటీడీకి విరాళంగా టాటా ఏస్

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన టాటా మోటార్స్ వరలక్ష్మి ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.5.06 లక్షల విలువైన ఈ టాటా ఏస్ ప్రో వాహనాన్ని టీటీడీకి విరాళంగా అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు రామ్‌ప్రసాద్, ప్రదీప్, రితేష్ రమేష్ కొటారి, మురళీకృష్ణ శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పేష్కార్ రామకృష్ణకు వాహనం తాళాలను అందజేశారు.



పేష్కార్‌కు వాహనం తాళాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు


సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,310

తలనీలాలు సమర్పించినవారు: 21,866



ముక్కంటి ఆలయంలో సెంట్రలైజ్డ్ సిస్టం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో పాలనను సెంట్రలైజ్డ్ సిస్టంతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. రాహుకేతు సర్పదోష నివారణ పూజల కోసం ఐదురకాల టిక్కెట్లు.. వివిధ ఆర్జిత సేవలు.. దర్శనాల టిక్కెట్లకు కౌంటర్లు కొనసాగిస్తున్నారు. అభిషేకాల కోసం మరో కౌంటర్ ప్రత్యేకంగా ఉంది. ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాలు ఉండటంతో టిక్కెట్ల కోసం భక్తులకు ఏ కౌంటర్‌కు వెళ్లాలో తికమక పడాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యేది. ఈ క్రమంలో అన్ని కౌంటర్లను ఒకే చోట ఏర్పాటు చేయడంపై అధికారులతో కలిసి ఇటీవల ఎమ్మెల్యే కసరత్తు చేశారు. సెంట్రలైజ్డ్ సిస్టంలో తొలి అడుగుగా అన్ని టిక్కెట్ కౌంటర్లను రెండో గేటు సమీపంలో ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీనికి షెడ్లు, క్యూలైన్లు, కంప్యూటర్లు, పరికరాల ఏర్పాటుకు సోమవారం పనులు ప్రారంభించారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

సమస్యలివీ..పరిష్కరించండి

కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 195 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అందలేదని.. తమ భూములు వేరేవారు ఆక్రమించారని.. వందశాతం వికలత్వం ఉన్నా తగ్గించేశారని.. పొదుపు సొమ్మును ఆర్పీ స్వాహా చేసిందని పలువురు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుకు ఫిర్యాదు చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 195 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకే 108 ఉన్నాయి. కాగా, పాపానాయుడుపేటకు చెందిన దివ్యాంగురాలు షాజహాన్‌కు అధికారులు మూడు చక్రాల సైకిల్ అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

పింఛన్ ఇప్పించి పుణ్యం కట్టుకోండి



లారీడ్రైవర్‌గా పనిచేసేవాడిని. ప్రమాదంలో కాలు కోల్పోయాను. గత ప్రభుత్వంలో పింఛను కోసం అధికారుల చుట్టు తిరిగి అలసిపోయా. భిక్షాటన చేసి కుటుంబాన్ని పోషిస్తున్నా. చంద్రబాబు ప్రభుత్వంలోనైనా పింఛను ఇచ్చి ఆదుకోండి.

- కె.వెంకటేష్, తాటితోపు, తిరుపతి రూరల్



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేస్తున్న జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

సాయినగర్ సమస్యలు పరిష్కరించండి



తిరుపతి రూరల్ మండలం సాయినగర్ గ్రామ పంచాయతీ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ డీవీ రమణ జేసీ శుభం బన్సల్‌కు విన్నవించారు. సాయినగర్, లింగేశ్వర్‌నగర్ పంచాయతీల్లో 40 ఏళ్లుగా హథీరాంజీ మఠం భూముల్లో నివాసముంటున్న ఇళ్లను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

పొదుపు సొమ్ము కాజేశారని ధర్నా




తాము నెలనెలా కట్టే పొదుపు సొమ్మును బ్యాంకు అధికారులతో కలిసి ఆర్పీ నౌహీరా కాజేసిందని కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన స్వయం సహాయక మహిళలు ధర్నా చేశారు. తిరుపతిలో దాదాపు 40 సంఘాల సభ్యుల నుంచి రూ.కోటి వరకు స్వాహా చేసిందని, దాన్ని రికవరీ చేయాలని కోరారు. ఆమెకు సహకరించిన బ్యాంకు అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు.

దళిత పిల్లలను చదువుకు దూరం చేయొద్దు

దళిత పిల్లలను చదువుకు దూరం చేయొద్దని శ్రీకాళహస్తి మండలం రాజుగుంట గ్రామస్తులు కోరారు. మా బడి మాకే కావాలంటూ ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ జిల్లాలో దళితులు ఎక్కడ ఉన్నారో ఆ పిల్లలను సుమారు 5, 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి మార్చడంతో వారు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. రాజుగుంట గ్రామానికి చెందిన పిల్లలను మన్నవరం మోడల్ స్కూల్‌లో కలపడం వల్ల శ్మశానం, చెరువు, అటవీ ప్రాంతం దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, అందుకే వారు ఇప్పటివరకు పాఠశాలకు వెళ్లలేదని పేర్కొన్నారు. ఇప్పటికే మూడుసార్లు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసినా పట్టించుకోకపోవడం దారుణమని, వెంటనే స్పందించాలని కోరారు.



తిరుమలలో మొదలైన విద్యుత్ అలంకరణ పనులు



గోపురానికి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ అలంకరణ ఏర్పాట్లనూ టీటీడీ ప్రారంభించింది. ఇప్పటికే శ్రీవారి ఆలయ గోపురానికి సున్నం పనులు పూర్తయ్యాయి. సోమవారం నుంచి విద్యుత్ దీపాల అమరిక పనులను మొదలుపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా తిరుపతివాసి



డాక్టర్ కొండారి విజయకుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా తిరుపతికి చెందిన డాక్టర్ కొండారి విజయకుమార్ నియమితులయ్యారు. 2001లో యూపీఎస్సీ ద్వారా ఇండియన్ లీగల్ సర్వీసులో సహాయ శాసన సలహాదారుగా ఆయన ఎంపికయ్యారు. ఈ క్రమంలో వివిధ హోదాల్లో పని చేశారు. తాజాగా పదోన్నతిపై కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా నియమితులయ్యారు. వివిధ చట్టాల రూపకల్పన, రద్దు, సవరణ విషయాల్లో విజయకుమార్ కీలక పాత్ర పోషించారు. ఎస్వీయూనివర్సిటీ లా విభాగంలోనే మాస్టర్ ఆఫ్ లా చదివిన ఈయన ఏయూ నుంచీ పీహెచ్‌డీ పూర్తి చేశారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

రూ.ఆరు లక్షలు జరిమానా

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ సోమవారం రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన అన్బు 2016లో జిల్లా పరిధిలోని పెరుమాళ్లపల్లి బీట్ టీఎన్ పాళ్యం సెక్షన్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు జరుగుతోంది. తాజాగా ప్రత్యేక కోర్టుకు బదిలీ కావడంతో విచారణ చేసిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో అన్బుకు ఈ మేరకు శిక్ష విధించారు.


చర్లపల్లి-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నవంబరు వరకు పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-తిరుపతి మధ్య ఈనెల 9వ తేదీ నుంచి నూతన మార్గంలో ప్రత్యేక రైళ్లను నవంబరు 26వ తేదీ వరకు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు (07013-07014) చర్లపల్లిలో ప్రతి మంగళవారం, తిరుపతిలో ప్రతి బుధవారమూ బయలుదేరి రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. చర్లపల్లి నుంచి బయలుదేరి నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ, దొనకొండ, గిద్దలూరు, నంద్యాల, కోయిలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, కోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుకుంటాయని వెల్లడించారు.

వినాయక నిమజ్జనానికి దారివ్వలేదని

దుర్గసముద్రంలో ఇరువర్గాల దాడి

ఉప సర్పంచి సహా ఆరుగురికి గాయాలు



వివాదంపై గ్రామస్తులతో చర్చిస్తున్న సీఐ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల నేపథ్యంలో జరిగిన దాడిలో గ్రామ ఉపసర్పంచ్‌తో సహా ఆరుగురు గాయపడ్డారు. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో ఐదు రోజుల పాటు చవితి వేడుకలు జరిగాయి. గ్రామంలో నిమజ్జన దారి విషయమై శనివారం గ్రామ ఉపసర్పంచ్ చిరంజీవి వర్గీయులు, మరో వర్గం మధ్య వాగ్వాదం జరిగింది. ఇది తీవ్రరూపం దాల్చింది. చిరంజీవి, అతని సోదరులు విజయ్, మహేష్, హరీష్, రాజకుమార్, రాజమోహన్‌లపై మరో వర్గం దాడి చేసింది. పెద్ద మనుషుల సమక్షంలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు. అయినా వీరి వివాదం చల్లారలేదు. సోమవారం మధ్యాహ్నం ఉప సర్పంచ్‌తో పాటు అతని తమ్ముళ్లపై బలిజ హరీష్, అతని సోదరులు, మరికొందరితో కలిసి దాడి చేశారు. దాడిలో చిరంజీవితో పాటు అతని సోదరులు గాయపడ్డారు. గాయపడిన ఆరుగురినీ రుయాకు తరలించారు. నిందితులు పరారీలో ఉన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రసాద్‌తో పాటు సీఐ సందర్శించారు. ఇరువర్గాలతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

నేడు ఎస్వీయూ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 71వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీలోని పలువురు ప్రముఖుల విగ్రహాలకు ఉన్నతాధికారులు పుష్పాంజలి ఘటిస్తారు. సాయంత్రం 5 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వర్సిటీ ముస్తాబైంది.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శెట్టిపల్లి భూములను పోరాడి సాధించుకుంటాం

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూములను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వి.నాగరాజు(సీపీఎం), సి.పెంచలయ్య(సీపీఐ), ఆర్.హరికృష్ణ(సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి), భూమన అభినయరెడ్డి(వైసీపీ), పి.అంజయ్య(ఆర్పిఐ) మాట్లాడుతూ 2019లో అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ రూపంలో రైతుల నుంచి 70, పట్టాదారుల నుంచి 50 శాతం భూములను తీసుకొందన్నారు. వెంటనే 173జీవో విడుదల చేసి, ప్లాట్లు వేసి బాధితులకు కేటాయించకుండా ఎన్నికల సాకు చూసి మోసం చేసిందన్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం ప్రొసీడింగ్స్ జారీ చేసినా ప్లాట్లు కేటాయించలేదన్నారు. 15 ఏళ్లుగా ఈ సమస్యపై పోరాటం చేస్తున్నా నాయకులు కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. ఈ క్రమంలో పోరాటాలను ఉధృతం చేయాలని నిర్ణయించారు.

పోరాట కార్యక్రమాల వివరాలు ఇలా..

- రెండో తేదీ కలెక్టర్‌కు సామూహిక వినతి పత్రం ఇవ్వడం
- నాలుగో తేదీ కేబినెట్ మీటింగ్‌లో శెట్టిపల్లి భూ సమస్యపై చర్చ జరగాలి.. లేనిపక్షంలో ఆరో తేదీ అఖిల పక్ష నాయకుల కరపత్రాల పంపిణీ
- తుడా కార్యాలయం వద్ద 8 నుంచి 14వ తేదీ వరకు నిరసన దీక్షలు
- 15, 16 తేదీల్లో 48 గంటల పాటు నిరవధిక నిరాహార దీక్షలు
- అప్పటికీ సమస్య పరిష్కారం కానిపక్షంలో భూముల్లోకి వెళ్లాలని నిర్ణయించారు.

తిరిగి తిరిగి అలసిపోయా..

- నా సమస్యపై అధికారులు పట్టించుకోలేదు
- గన్నేరుపప్పు తిని పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన మహిళ
- తిరుపతి కలెక్టరేట్‌లో కలకలం.. ఆస్పత్రికి తరలింపు



అధికారులకు ఫిర్యాదు చేశాక అపస్మారకస్థితికి చేరుకున్న ఇందు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'నన్ను కులాంతర వివాహం చేసుకున్న శరత్‌కుమార్.. ఇప్పుడు రెండో పెళ్లికి సిద్ధమై నిశ్చితార్థం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం స్పందించలేదు. కలెక్టరేట్ చుట్టూ నాలుగు పర్యాయాలు తిరిగినా న్యాయం జరగలేదు' అంటూ ఇందు అనే మహిళ గన్నేరుపప్పు (విషపు కాయలు) తిని తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు వచ్చారు. జేసీ శుభంబన్సల్‌కు వినతిపత్రం ఇచ్చిన ఆమె.. అక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో ఉలిక్కిపడ్డ అధికారులు ప్రథమ చికిత్స కేంద్రంలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సమాచారమిచ్చారు. అనంతరం డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తన వాహనంలో ఆమెను రుయాస్పత్రికి తరలించారు. ఈమెది తిరుపతి నగరంలోని యాదవకాలనీ. 'నాలుగేళ్ల కిందట శరత్‌కుమార్‌రెడ్డితో ఓటేరు సాయిబాబా ఆలయంలో ప్రేమ వివాహమైంది. అతడి కుటుంబ సభ్యులకు మా పెళ్లి ఇష్టంలేదు. నిత్యం నన్ను తక్కువ జాతి కులమని వేధించేవారు. ఓ మెడికల్‌షాప్‌లో పనిచేసే నా భర్త రూ.10 లక్షలు కట్నం తెస్తేనే రానిస్తామన్నాడు. మే నెల 2న నన్ను వదలి వెళ్లిపోయాడు. నన్ను దళితురాలినంటూ వేధించడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఇప్పుడు రెడ్డి కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి నిశ్చితార్థం చేసుకున్నాడు. నేను అడిగితే వాళ్లు బెదిరిస్తున్నారు. నా భర్తను నాతో పంపేలా చేసి, నన్ను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి' అని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద తిరుపతి ఈస్ట్ పోలీసులు రెండు నెలల కిందటే కేసు నమోదు చేసున్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

టీటీడీ ఉద్యోగుల నిరసన



ఏడీ భవనం ముందు నిరసన తెలుపుతున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్, సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గోల్కొండ వెంకటేశం, మల్లారపు నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు టీటీడీ పరిపాలనా భవనం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని ఉద్యోగులు వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుణశేఖర్, పద్మనాభం, రవికుమార్, ఆవుల నరేష్, కిరణ్‌కుమార్, దయాకర్, వేణుగోపాల్, బాలాజీ, కృష్ణమూర్తి, ఆదిలక్ష్మి, ఇందిరా, ప్రతిభా భారతి, శకుంతల, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

రుయాస్పత్రి పరిపాలనా భవనం వద్ద..

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలంటూ రుయాస్పత్రిలోని ఏడీ భవనం ముందు సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మోసపూరిత హామీతో మోసం చేయగా, ప్రస్తుత ప్రభుత్వమూ అదే బాటలో పయనిస్తోందని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి అన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మహిళా ఉద్యోగ నేతలు భువనేశ్వరి, సుభాషిణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల స్థలాల పరిశీలన

తిరుపతి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి) : టీడీఆర్ బాండ్లు మంజూరు చేయనున్న స్థలాలను క్షేత్రస్థాయిలో సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలను కోల్పోయిన సుమారు ఎనిమిది మంది స్థలాలకు సంబంధించిన పత్రాలతో పాటు స్థలాలను పరిశీలించారు. లీలా మహల్ కూడలి, జబ్బార్ లే ఔట్, ఉపాధ్యాయనగర్, చింతలచేను వద్ద గల వంద అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు, సత్యనారాయణపురం స్థలాలను పరిశీలించారు. అలాగే రెండు భవనాల నిర్మాణ అనుమతులను, ప్లాన్‌ను పరిశీలించారు. కమిషనర్ వెంట డీసీపీ ఖాన్ ఉన్నారు.

జ్ఞాన సముపార్జనకు సదస్సులు దోహదం



వైద్య అధ్యాపకులకు జ్ఞాపికలను అందజేస్తున్న రాధ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు జ్ఞానాన్ని సమృద్ధి చేసుకునేందుకు వర్క్‌షాప్‌లు ఉపయోగపడతాయని రుయా సూపరింటెండెంట్ రాధ అన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో సోమవారం ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్ క్లినికల్ ప్రాక్టీస్(జీసీపీ) వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాధ మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మార్గదర్శకత్వంలో వర్క్‌షాప్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులతోపాటు వైద్యులకూ ఇది ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అబ్జర్వర్‌గా నియమితులైన రుయా రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని ఈ సందర్భంగా సన్మానించారు. ఫార్మకాలజీ వైద్య అధ్యాపకులకు, పరిశోధకులకు జ్ఞాపికలను అందజేశారు. జీసీపీ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ రవిప్రభ, ఆర్గనైజింగ్ ఉప కార్యదర్శి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నిబంధన లే 'అవుట్'


ఎల్‌పి సాగరంలో అనుమతులు లేని అక్రమ లేఅవుట్

నాయుడుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. చెన్నై - కోల్‌కత్తా, నాయుడుపేట - పూతలపట్టు రెండు జాతీయ రహదారుల నడుమ ప్రాంతం కావడం, సమీపాన మేనకూరు సెజ్ ఉండడంతో స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. కనిష్టంగా అంకణం రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పలుకుతోంది. ఎల్‌పి సాగరంలో వేసిన ఓ లేఅవుట్‌కు రెవెన్యూశాఖ నుంచి భూమార్పిడి గానీ, మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులుగానీ లేవు. అయినా ఎంచక్కా సర్వే నెంబరు 110లో దాదాపు ఎకరా స్థలంలో ప్లాట్‌లు వేశారు. లేఅవుట్‌లో 10శాతం ప్రజా ప్రయోజనాల కోసం మున్సిపాలిటీ పేరిట రిజిస్టర్ చేయాల్సి ఉన్నా అలా చేయలేదు. లేఅవుట్‌లో 30 అడుగుల రోడ్డు నిర్మించాల్సి ఉండగా, అదీ జరగలేదు. అలాగే సప్తగిరి కాలనీ సమీపంలో చెరువు లోతట్టు ప్రాంతంలో లేఅవుట్ వేశారు. భారీ వర్షాలు వస్తే ఆ ప్రాంతం మునిగిపోతుంది. అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపడితే వర్షాలు పడినప్పుడల్లా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్‌లు లేనప్పటికీ అధికారులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా లేఅవుట్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు, అనుమతులు లేని లేఅవుట్‌లకు నోటీసులు జారీచేస్తామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పేర్కొన్నారు.

సముద్రపు నాచు పెంపక ప్రాంతాల పరిశీలన

వాకాడు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచు పెంపకం చేపడుతున్న కొండూరుపాళెం, అంజలాపురం గ్రామాల్లో సెంట్రల్ గ్లోబల్ క్లైమెట్ ఫండ్ అధికారి డాక్టర్ రఫీ సోమవారం పర్యటించారు. సముద్రపు నాచు పెంచే గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఫీ మాట్లాడుతూ జిల్లాలో రెండు ప్రాంతాలు సముద్రపు నాచు పెంపకానికి అనువైనవిగా గుర్తించడం జరిగిందన్నారు. సముద్రంలో అలలు తక్కువగా ఉండి బ్యాక్ వాటర్ ఉన్న ప్రాంతాలు సముద్రపునాచు పెంపకానికి అనువుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అళగనాథస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గూడూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళగనాథస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. చైర్మన్‌గా బత్తిన వెంకటసుధాకర్‌ప్రసాద్, సభ్యులుగా రామ్మూర్తి, నాగూరు, తూపిలి సురేంద్ర, పావని, విజయలక్ష్మి, శశికళ, నాగమణి, రాజేశ్వరి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

గూడూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు తమ వార్డుల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ముందుగా చంద్రబాబునాయుడు తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి నాయకుడు తమ వార్డుల్లో ప్రజల సమస్యలను తెలుకుని వాటిని పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, రవీంద్రరెడ్డి, చంద్రమౌళి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించండి


భూముల్లో బైఠాయించి నిరసన తెలుపుతున్న మన్నెగుంట గ్రామస్తులు

చిల్లకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగుంట గ్రామ సమీపంలోని జిందాల్ పవర్ పరిశ్రమకు కేటాయించిన భూములకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మన్నెగుంట గ్రామస్తులు మాట్లాడుతూ తమ భూములను 2008లో కినెటా పవర్ పరిశ్రమకు అప్పగించారన్నారు. అప్పట్లో కొంత నష్టపరిహారం మాత్రమే చెల్లించారని తెలిపారు. అయితే ఆ భూముల్లో పరిశ్రమ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం ఆ భూములను జిందాల్ పరిశ్రమకు కేటాయించడంతో పనులు ప్రారంభించారన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలక పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యం లాభదాయం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వరిలో సమగ్ర ఎరువుల యాజమాన్యం రైతులకు ఎంతో లాభదాయంగా ఉంటుందని జిల్లా వరద నివారణ కేంద్రం వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో డివిజనల్ స్థాయి వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరిలో సేంద్రియ ఎరువుల మీదనే ఆధార పడకుండా జనుము, జీలుగు వంటి పచ్చిరొట్ట ఎరువులను వాడుకోవాలన్నారు. జీవన ఎరువులను కూడా కలిపి వాడినట్లయితే ఖర్చు తగ్గడమే కాకుండా ఆదాయం పెరుగుతుందన్నారు. రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అనసూయ, ఏవోలు సుజాత, శిరిషా, ప్రవీణా, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో ఎక్కువ పింఛన్లు: విజయశ్రీ

పెళ్లకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలను మించి మన రాష్ట్రంలో ఎక్కువ పింఛన్లు ఇస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం పెళ్లకూరులో అబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు రమేష్‌నాయుడు, రాజగోపాల్‌రెడ్డి, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, అక్కురపల్లి మాధవరెడ్డి, ఉచ్చూరు ప్రసాద్‌రెడ్డి, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మాడుపూరు మురళీనాయుడు, వేలూరు హరినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్, కన్నలి వాసు, వేణు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో పలు రైళ్ల నిలుపుదల

నాయుడుపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మధురై జంక్షన్ నుంచి బారైని జంక్షన్‌కు వెళ్లే వీక్లీ స్పెషల్ 06059, ఎక్స్‌ప్రెస్, బారైని నుంచి మధురై వెళ్లే 06060 ఎక్స్‌ప్రెస్ ఈనెల 10,13 తేదీల నుంచి నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ఆగనున్నట్లు స్టేషన్ మాస్టర్ చిరంజీవి, సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మస్తాన్, ప్రధాన కార్యదర్శి పేర్నాటి జోసెఫ్, ఉపాధ్యక్షుడు రాఘవన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కొమ్మలు తొలగించే పనుల కారణంగా మంగళవారం ఉదయం 8నుంచి మధ్నాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ శీనయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

తడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప గ్రామానికి చెందిన కార్తీక్(33) గుమ్మిడిపూడిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గత నెల 30వ తేదీ విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా శ్రీసిటీ జీరోపాయింట్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని చెన్నై ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు.



సోమవారం ఉదయం 11 గంటలకు గ్రీవెన్స్ డేలో ఉన్న ముగ్గురు అధికారులు - గ్రీవెన్స్ డే రిజిస్టర్‌లో సంతకాలు పెట్టిన 8 శాఖల అధికారులు

గ్రీవెన్స్ డే వెలవెల

పలు శాఖల అధికారుల డుమ్మా

సూళ్లూరుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు మొక్కుబడిగా హాజరవుతున్నారు. సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి పలుశాఖ అధికారులు డుమ్మా కొట్టడంతో వెలవెలపోయింది. మండల స్థాయిలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా గ్రీవెన్స్‌లో పాల్గొనాలి. మొత్తం 23 శాఖలకు సంబంధించిన అధికారులుంటే కేవలం 8 మంది గ్రీవెన్స్ డేకి హాజరయ్యారు. అందులో 6 శాఖల అధికారులు 11 గంటలకే వెళ్లిపోయారు. మధ్నాహ్నం 1 గంట వరకు ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, గృహనిర్మాణ శాఖ అధికారులు మాత్రమే గ్రీవెన్స్ డేలో ఉన్నారు. ఫారెస్ట్, ఆర్టీసీ, విద్యుత్, ఇరిగేషన్, దేవదాయశాఖ, బీసీ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గ్రీవెన్స్ డే కార్యక్రమాలకు అసలు హాజరు కావడం లేదు. అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్ డేలో అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్జీలిద్దామంటే అధికారులేరీ?

వెంకటగిరి టౌన్: మండల కేంద్రంలోని తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులు లేకపోవడంతో సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం వెలవెలబోయింది. గ్రీవెన్స్‌లో సమస్యలు చెప్పుకుందామని వచ్చిన ప్రజలు కార్యాలయాల్లో అధికారులు ఎవరూ లేకపోవడంతో తిరుగు ముఖం పట్టారు. గ్రీవెన్స్‌లో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతామని అధికారులు ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప.. వినతులు స్వీకరించడానికి తీరికలేదని విమర్శిస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి అధికారులు ఎవరూ లేకపోవడంతో మండి పడ్డారు. అయినా అధికారుల్లో మార్పు లేకపోవడం గమనార్హం.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ప్రదాత చంద్రబాబు: విజయశ్రీ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు నవ్యాంధ్ర ప్రదేశ్‌నూ అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు హైదరాబాదులో హైటెక్ సిటీకి బీజాలు వేశారని గుర్తు చేశారు. అలాగే డ్వాక్రా సంఘాలు నెలకొల్పి మహిళా సాధికారతకు శ్రీకారం చుట్టారని అన్నారు. మరో 20 సంవత్సరాలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమాన్ని ప్రారంభించి అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేసిన ఘనత చంద్రబాబుదేన్నారు. నవ్యాంధ్రలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫీ, అరవపేరిమిడి చంద్రారెడ్డి, గంగాప్రసాద్, ఫైలారి రాజశేఖర్, శ్రీరామ్ ప్రసాద్, రమణారెడ్డి, సుబ్బారావు, చేవూరి చెంగయ్య, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, అశోక్‌రెడ్డి, పోట్లపూడి రాజేష్, చక్రపాణి, నిత్యకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వరికోత యంత్రం డ్రైవర్ మృతి


రవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ పవన్‌కుమార్

కోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిమ్మానాయుడు పాళెం వద్ద సోమవారం వరికోత మిషన్‌కు విద్యుత్ మెయిన్ వైర్లు తగిలి డ్రైవర్ రవి (23) అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా చందనూరు మండలం గుడుగులదిన్నె గ్రామానికి చెందిన రవితో పాటు కొంతమంది స్నేహితులు గత నెల 23వ తేదీన కోట మండలానికి వరికోత యంత్రాలు తీసుకువచ్చారు. సోమవారం తిమ్మానాయుడుపాళెం, ఉచ్చూరువారిపాళెం రోడ్డు సమీపంలో ఓ రైతుకు చెందిన వరి పైరును కోసేందుకు వెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రవి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

కోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట ఎంపీడీవోగా దిలీప్‌కుమార్ నాయక్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన నెల రోజులపాటు బాపట్లలో శిక్షణ తీసుకొని తిరిగి వచ్చారు. ఆయనకు ఈవోపీఆర్‌డీ వేణు బాధ్యతలను అప్పగించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఏర్పాట్లను తహసీల్దార్ నరసింహరావు, ఏఈ బాబు సోమవారం పరిశీలించారు. ఈ నెల 10, 11 తేదీలో రెండు రోజుల పాటు జాతర నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు దర్శన ఏర్పాట్లు, వీఐపీ వాహనాల రాకపోకలు, దర్శనాల క్యూలైన్లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ రాజేష్, వీఆర్వోలు, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

దుర్భాషలాడినందుకు కేసు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదదర్గావీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపం కమిటీ అధ్యక్షుడు రాజేష్‌ను దుర్భాషలాడిన వారిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణానికి చెందిన ఖాదర్‌బాషా మరి కొంతమంది యువకులు ఆదివారం మధ్యాహ్నం వినాయక మండపంలో ప్రవేశించి రాజేష్‌ను దుర్భాషలాడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలకు లైబ్రరీ షెల్ఫ్ వితరణ

తడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అండగుండాల ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో సోమవారం లైబ్రరీ షెల్ఫ్ అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు అప్పారావు జన్మదినాన్ని పురష్కరించుకుని నాగేశ్వర స్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆదినారాయణ రెడ్డి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు రామయ్యకు లైబ్రరీ షెల్ఫ్ అందజేశారు. కార్యక్రమంలో ఆదిశేషారెడ్డి, వసుంధర, లలితారెడ్డి, హేమలత, మధుసూదన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

వెంకటగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) రక్తదానం ప్రాణదానంతో సమానమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సీఐ రమణ అన్నారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామారావు అనిల్, బాషా, అన్నపూర్ణ, సాయి, రాధమ్మ, రాజేష్, రవిశంకర్, రవికుమార్, రామోహన్, రీజ్వా, శ్రీను,మల్లి, ప్రవల్లిక, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవోలు శిరీష, మస్తానయ్య తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

పెచ్చులూడిన సర్వేయర్ గది

సూళ్లూరుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సర్వేయర్ గది, ఎన్నికల డీటీ గదులు శ్లాబు పైకప్పులు పగుళ్లు ఇచ్చాయి. సోమవారం ఉదయం సర్వేయర్ గదిలో పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పెచ్చులూడి పడడంతో కుర్చీ, కంప్యూటర్ సామగ్రి దెబ్బతిన్నాయి. వెంటనే సిబ్బంది తహసీల్దార్ గోపినాథ్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పెచ్చులూడిన గదిని పరిశీలించారు.

పెన్నక్కచెరువు కబ్జా భూముల పరిశీలన


పెన్నక్కచెరువులో కబ్జాచేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈఈ మునిరత్నం

కోట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం, చంద్రశేఖరపురం సమీపంలో ఉన్న పెన్నక్క చెరువు లోతట్టు ప్రాంతంలో కబ్జాకు గురైన భూములను సోమవారం నీటిపారుదలశాఖ అధికారులు పరిశీలించారు. చెందోడు, విద్యానగర్‌కు చెందిన కొంతమంది పెన్నక్క చెరువు లోతట్టు భూములను కబ్జా చేసేందుకు ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేశారు. విషయం తెలుసుకున్న రైతులు, సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరుమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అసిస్టెంట్ ఇంజనీర్ మునిరత్నం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా కబ్జాకు గురైన భూములను పరిశీలించారు. సర్వే చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

హామీలను నెరవేర్చిన ఘనత చంద్రబాబుదే: పాశం

గూడూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక 16వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, శివకుమార్, సుమన్, మునిగిరీష్, రవీంద్రరెడ్డి, ప్రణీత్, జానకి తదితరులు పాల్గొన్నారు.